'కొండ'ంత జనం



కృష్ణతేజ సర్కిల్ నుంచి శిలాతోరణం వరకు క్యూలో వేచి ఉన్న భక్తులు

వేసవి సెలవుల తర్వాత స్కూళ్లు మొదలైన నేపథ్యంలో శ్రీవారి ఆశీస్సుల కోసం పిల్లలతో వచ్చే తల్లిదండ్రుల సంఖ్య అధికంగా ఉంది. ఈక్రమంలో శుక్ర, శనివారాల తరహాలో ఆదివారం కూడా తిరుమల క్షేత్రం కిటకిటలాడుతోంది. వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లోని కంపార్టుమెంట్లు, నారాయణగిరి పార్కులోని షెడ్లు మొత్తం భక్తులతో నిండిపోయాయి. క్యూలైన్ సుమారు కిలోమీటరు మేరకు రింగురోడ్డులో వ్యాపించింది. భారీ పొడవైన క్యూలైన్లలో చిన్న పిల్లలు, వృద్ధులకు అవస్థలు తప్పలేదు. క్యూలైన్లలోని భక్తులు ఇబ్బందులు లేకుండా టీటీడీ నిరంతరాయంగా అన్నప్రసాదాలు, పాలు, మజ్జిగ అందజేసింది. రద్దీ కొనసాగుతున్న క్రమంలో శ్రీవారి ఆలయ ప్రాంతం, లేపాక్షి, రాంభగీచ కూడళ్లతో పాటు గదులు కేటాయించే కౌంటర్లు, కల్యాణకట్టలు, లడ్డూకేంద్రం, అఖిలాండం, యాత్రికులు వసతి సముదాయాలు, అన్నప్రసాద భవనాల్లో భక్తుల సందడి నెలకొంది. మరోవైపు తిరుగుప్రయాణ భక్తులతో బాలాజీ, రాంభగీచా ఆర్టీసీ బస్టాండ్లు రద్దీగా దర్శనమిచ్చాయి.

\- తిరుమల, ఆంధ్రజ్యోతి

॥ వైభవంగా శ్రీహరి చక్రస్నానం ॥

వడమాలపేట మండలం అప్పలాయగుంటలోని ప్రసన్న వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో చివరి రోజైన ఆదివారం ఉదయం చక్రస్నానం శాస్త్రోక్తంగా నిర్వహించారు. అంతకుముందు 9.15- 10.30 గంటల మధ్య శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరుడికి, చక్రత్తాళ్వార్‌కు పుష్కరిణి ఎదురుగా స్నపన తిరుమంజనం జరిగింది. రాత్రి 7- 7.30 గంటల మధ్య గరుడ పటాన్ని ధ్వజావరోహణం చేయడంతో బ్రహ్మోత్సవాలు ముగిశాయి.


\- వడమాలపేట, ఆంధ్రజ్యోతి



- కొవిడ్ టెస్ట్ కిట్లు తెచ్చుకోమని రోగులకు రాసిస్తున్న స్విమ్స్ వైద్యులు
- చీటీలు పట్టుకుని ఊరంతా తిరుగుతున్న రోగుల బంధువులు

కిట్లు ఎక్కడనుంచి తేవాలి?

తిరుపతి - ఆంధ్రజ్యోతి



నెల్లూరు సమీపంలోని కొత్తూరు నుంచి వెంకటస్వామి (56) చికిత్స కోసం శనివారం ఉదయం స్విమ్స్ ఆస్పత్రికి వచ్చారు. ఆటోడ్రైవర్‌గా పనిచేస్తున్న ఆయన కాలుకు ఇన్ఫెక్షన్‌తో పాటు కడుపు ఉబ్బరంగా ఉండడంతో కుమారుడు శ్రీకాంత్ స్విమ్స్‌కు తీసుకొచ్చారు. వైద్యులు పరీక్షించి క్యాజువాల్టీలో చేర్చుకున్నారు. అతడికి కొవిడ్ టెస్ట్ చేయాలని కిట్ బయట కొనుక్కొని రావాలని సిబ్బంది సాయంత్రం చీటీ రాసి శ్రీకాంత్‌కు ఇచ్చారు. ఆ చీటీతో ఆయన నగరంలోని ఎన్నో మెడికల్ షాపులకు తిరిగారు. ఎక్కడా కిట్ దొరక్కపోవడంతో స్విమ్స్‌కు తిరిగి వెళ్లారు.

ఇలా ఎందరో కొవిడ్ కిట్ల కోసం తిరుగుతున్నారు. కరోనా వైరస్ నిర్ధారణ కోసం ఆర్టీపీసీఆర్ పరీక్షను ప్రామాణికంగా తీసుకుంటారు. స్విమ్స్, రుయాస్పత్రుల్లో అనుమానం ఉన్న రోగులకు ఇవి చేస్తున్నారు కూడా. దీని ఫలితం వచ్చేందుకు ఆరేడు గంటల సమయం తీసుకుంటుంది కాబట్టి ర్యాపిడ్ యాంటిజెన్ టెస్ట్ కిట్స్ ద్వారా తాత్కాలిక నిర్ధారణ కోసం పరీక్షిస్తుంటారు. గతంలో వచ్చిన కొవిడ్ దశల్లో ర్యాపిడ్ టెస్ట్ కిట్లు ప్రైవేట్ మందుల షాపుల్లో దొరికేవి. ప్రస్తుతం కొవిడ్ వ్యాప్తి నేపథ్యంలో ర్యాపిడ్ కిట్లు ప్రైవేట్ సరఫరా లేదు. అదితెలియక స్విమ్స్ సిబ్బంది అనుమానిత రోగులకు ర్యాపిడ్ టెస్టు కిట్లు రాయడం వల్ల వాటికోసం అలిసిపోయేలా తిరగాల్సి వస్తోంది. ఇకనైనా కిట్లు అందుబాటులోకి వచ్చేవరకు స్విమ్స్‌లో చేసే ఆర్టీపీసీఆర్ పరీక్ష ద్వారానో, ప్రభుత్వం సరఫరా చేసే కిట్లనో వినియోగించాల్సి ఉంది.

ర్యాపిడ్ కిట్లు అందిస్తాం

అనుమానిత రోగులకు కొవిడ్ నిర్ధారణకు ఆర్టీపీసీఆర్ ద్వారా టెస్ట్ చేయాలి. ఒకవేళ అత్యవసరమనిస్తే ర్యాపిడ్ టెస్టు చేయాలి. ప్రస్తుతం ప్రైవేట్‌గా అవి అందుబాటులోకి రాలేదు. నేడో, రేపో 700 ర్యాపిడ్ టెస్టు కిట్లు ఆస్పత్రులకు పంపిణీ చేయనున్నాం. ఇటీవల కొవిడ్ వ్యాప్తి నేపథ్యంలో 16 మందికి పాజిటివ్ వచ్చింది. అయితే ఎవరికీ ఎలాంటి ఇబ్బందులు లేవు. హోం ఐసొలేషన్ ద్వారానే తిరిగి నెగటివ్ వస్తోంది.

\- బాలకృష్ణ నాయక్, డీఎంహెచ్‌వో



సెల్‌ఫోను టార్చ్ వెలుగులో వైద్యం అందిస్తున్న సిబ్బంది - అత్యవసర విభాగంలో సెల్‌ఫోన్ లైట్ వెలుతురులో సూపరింటెండెంట్ రమేష్ తదితరులు

చీకట్లో ప్రభుత్వాస్పత్రి

- జనరేటర్ పనిచేయక ఇబ్బందులు
- సెల్‌ఫోను టార్చ్ వెలుగులో వైద్య సేవలు

సూళ్లూరుపేట, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రిలో చీకట్లో వైద్య సేవలు అందించాల్సి వచ్చింది. ఆస్పత్రిలోని జనరేటర్ పనిచేయకపోవడంతో ఈ సమస్య నెలకొంది. ఆదివారం ఉదయం సూళ్లూరుపేట పట్టణం, మండలంలోని మన్నారుపోలూరు, మంగానెల్లూరు సబ్ స్టేషన్లలో మరమ్మతుల కారణంగా ఆదివారం ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని అధికారులు ప్రకటించారు. మరమ్మతులు ఆలస్యం కావడంతో విద్యుత్ సరఫరాను రాత్రి 8 గంటలకు పునరుద్ధరించారు. పగలంతా వెలుతురు ఉండటంతో పెద్దగా ఇబ్బంది తలెత్తలేదు. కానీ, సాయంత్రం 6 గంటకు చీకటి పడడంతో ప్రభుత్వాస్పత్రిలోని అత్యసర విభాగంలో రోగులకు వైద్య సేవలు అందించేందుకు వైద్యులు ఇబ్బంది పడ్డారు. రోగుల బంధువుల సెల్‌ఫోన్ల టార్చిలైట్ల వెలుతురులోనే వైద్యం అందించారు. జనరేటర్ పనిచేయక పోవడంతో ఉదయం నుంచి ఆస్పత్రిలోని ఆయా వార్డుల్లో ఉన్న రోగులు ఇబ్బంది పడ్డారు. విద్యుత్‌కు అంతరాయం కలిగినప్పుడల్లా రోగులకు అవస్థలు తప్పడంలేదు. ఆపరేషన్ చేసే సమయంలో కరెంట్ పోతే అంతే సంగతులు. ఇక, 12 గంటల పాటు విద్యుత్ సరఫరా లేకపోవడంతో సూళ్లూరుపేట పట్టణం, మండలంలోని మన్నారుపోలూరు, దామానెల్లూరు, ఉచ్చూరు, ఇలుపూరు, మంగళంపాడు, మంగానెల్లూరు గ్రామాల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

నేడు కేంద్రమంత్రిచే క్రిస్‌సిటీ ఏరియల్ సర్వే


సెంట్రల్ మినిస్టర్- విమానాశ్రయంలో కేంద్ర మంత్రి గోయల్

తిరుపతి(కలెక్టరేట్), జూన్ 15(ఆంధ్రజ్యోతి): జిల్లాలో 2,500 ఎకరాల్లో చేపట్టిన కృష్ణపట్నం ఇండస్ట్రియల్ నోడ్ (క్రిస్ సిటీ) పనులను కేంద్ర వాణిజ్య, పరిశ్రమలశాఖ మంత్రి పియూష్‌గోయల్ సోమవారం ఉదయం హెలిక్యాప్టర్‌లో ఏరియల్ సర్వే నిర్వహించనున్నారు. రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్, కలెక్టర్ వెంకటేశ్వర్ కేంద్ర మంత్రితో కలిసి రేణిగుంట విమానాశ్రయం నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి క్రిస్‌సిటీ ఏరియల్ సర్వేలో పాల్గొంటారు. క్రిస్‌సిటీ అభివృద్ధికి కేంద్రం నుంచి రావాల్సిన నిధులపై జిల్లా అధికారులతో కేంద్రమంత్రి చర్చించనున్నట్లు తెలిసింది. ఇప్పటికే రూ.200 కోట్లకుపైగా జరిగిన క్రిస్‌సిటీ పనులపైనా ఆయన సమీక్షించనున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకుగాను కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ ఆదివారం రాత్రి విమానాశ్రయానికి చేరుకోగా.. రాష్ట్ర మంత్రి అనగాని సత్యప్రసాద్, కలెక్టర్ వెంకటేశ్వర్, టీటీడీ సభ్యుడు భానుప్రకాష్, బీజేపీ నేతలు స్వాగతం పలికారు. తిరుమలకు వెళ్లిన కేంద్ర మంత్రి సోమవారం ఉదయం శ్రీవారిని దర్శించుకుని, ఏరియల్ సర్వేలో పాల్గొననున్నారు.

విశాఖ యోగా సంగమ నిర్వహణకు
ఇద్దరు ఎమ్మెల్యేలకు పిలుపు


రైలులో బయల్దేరిన ఎమ్మెల్యేలు అమర్, నాని

తిరుపతి, జూన్ 15(ఆంధ్రజ్యోతి): విశాఖలో ఈనెల 21న జరిగే 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా యోగా సంగమం కార్యక్రమ నిర్వహణ కోసం ఉమ్మడి చిత్తూరుజిల్లా నుంచి ఇద్దరు ఎమ్మెల్యేలకు పిలుపు వచ్చింది. విశాఖలో 21న ప్రధాని నరేంద్రమోదీ పాల్గొనే ఈ కార్యక్రమంలో 40 దేశాలకు చెందిన ప్రతినిధులతో పాటు 5లక్షల మంది ప్రజలు పాల్గొంటారని అంచనా. యోగా సంగమం విశాఖలో జరుగుతుండడం, దేశప్రధాని స్వయంగా పాల్గొంటున్న కారణంగా ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా పరిగణిస్తోంది. దానికి అనుగుణంగా ఏర్పాట్లు చేస్తోంది. అందులో భాగంగా యోగా సంగమం నిర్వహణకు రాష్ట్రవ్యాప్తంగా 15మంది ఎమ్మెల్యేలకు సీఎం చంద్రబాబు నుంచి పిలుపు అందింది. ఈ కార్యక్రమ నిర్వహణలో కీలక బాధ్యతలను వారికి అప్పగించనున్నట్లు సమాచారం. ఆ 15మందిలో ఉమ్మడి జిల్లా నుంచి పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని ఉన్నారు. వీరిద్దరూ ఆదివారం సాయంత్రం తిరుపతి నుంచి రైల్లో విశాఖకు బయల్దేరి వెళ్లారు. వారికి ఏ బాధ్యతలు అప్పగించేది సోమవారం తెలియనుంది.

మంత్రి ఆదేశించినా..
మామిడి రైతుకు మద్దతేదీ?

- రూ.6కి మించి ఇవ్వలేమంటున్న యాజమాన్యాలు
- కాదంటే ఫ్యాక్టరీలు మూసేయడానికి సిద్ధమంటున్న వైనం

చిత్తూరు సెంట్రల్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఎన్ని చర్యలు చేపట్టినా మామిడి రైతుకు మద్దతు ధర లభించడంలేదు. మద్దతు ధర రూ.12గా ప్రకటించిన ప్రభుత్వం రూ.4 రాయితీ ఇస్తోంది. ఫ్యాక్టరీలను రూ.8 ఇవ్వాలని చెప్పింది. ఈ మేరకు శనివారం తిరుపతి జిల్లా పాకాల, చిత్తూరులో పర్యటించిన మంత్రి అచ్చెన్నాయుడు యాజామాన్యాలను ఆదేశించారు. దీంతో ఆదివారం నుంచి మద్దతు ధర లభిస్తుందని రైతులు ఆశించినా.. యాజమాన్యాలు రూ.6కి మించి ఇవ్వలేమంటూ స్పష్టంచేశాయి. అంతకుమించి ఇవ్వాలంటే ఫ్యాక్టరీలు మూసేయడానికి సిద్ధమని పేర్కొంటున్నాయి. ప్రభుత్వ ఆదేశాలను గౌరవిస్తామని, అయితే నష్టానికి వ్యాపారాలు చేయలేమంటున్నాయి. 'గతేడాదికి సంబంధించి 2.50 లక్షల టన్నుల పల్ప్ నిల్వలు ఉన్నాయని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదు. ఇందులో 50 టన్నులు చెడిపోగా, లక్ష టన్నుల వరకు ఇంకా నిల్వ ఉంది. ఈ పరిస్థితుల్లో తోతాపురి కిలోకు రూ.8 ఇవ్వాలంటే తాము నష్టపోతామంటున్నాయి. మద్దతు ధర లభించక పోవడంతో పక్వానికి వచ్చిన కాయలు తోటల్లోనే రాలిపోతున్నాయి. మరోవైపు ఫ్యాక్టరీల వద్దకు తీసుకొచ్చిన కాయలను రూ.6కి ఇవ్వాలా వద్దా అని ఇంకొందరు రైతులు తర్జనభర్జన పడుతున్నారు.




నేడు పీజీఆర్ఎస్

తిరుపతి(కలెక్టరేట్), జూన్ 15(ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టరేట్, రెవెన్యూ డివిజన్.. మండల కేంద్రాల్లో సోమవారం జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదివారం ఓ ప్రకటనతో కోరారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు అధికారులు అర్జీలను స్వీకరిస్తారని పేర్కొన్నారు. అర్జీదారులు తమ అర్జీలను వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవచ్చని సూచించారు. నమోదైన అర్జీల స్థితికి సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100కు నేరుగా కాల్ చేయొచ్చని తెలిపారు.

నిషేధం ముగిసినా.. వేటకు అంతరాయం

- సముద్రంలో అలల ఉధృతితో ఆగిన మత్స్యకారులు
- సాయంత్రం వెళ్లిన కొన్ని పడవలు

కోట, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): సముద్ర వేటకు 61 రోజుల నిషేధం ముగిసింది. ఇక, ఆదివారం చేపలు పట్టేందుకు సముద్రంలోకి వెళ్లేందుకు సిద్ధమైన మత్స్యకారులకు అలల రూపంలో ఆటంకం ఎదురైంది. దీంతో సాయంత్రానికి కొందరు మాత్రమే బోట్లలో వెళ్లారు. సముద్రంలో చేపలు గుడ్లు పెట్టడం, సంతానోత్పత్తి సందర్భంగా మత్స్యశాఖ అధికారులు కోట, వాకాడు, చిల్లకూరు మండలాల్లోని మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లకుండా నిషేధం విధించారు. ఆంక్షల సమయంలో మత్స్యకారులు అతిక్రమించి చేపల వేటకు వెళ్తారన్న సముద్రంలో ఎప్పటికప్పుడు మత్స్యశాఖ పర్యవేక్షిస్తూ వచ్చింది. ఈ రెండు నెలల కాలంలో అరకొరతప్ప పలువురు సముద్రంలో చేపలవేటకు వెళ్లే మత్స్యకార కుటుంబాలు పస్తులతో గడపాల్సి వచ్చింది. సముద్రంలో చేపల వేట నిషేధ గడువు ముగియడంతో ఆయా మండలాల్లోని మత్స్యకారులు ఆదివారం ఉదయం బోట్లు, పడవలతో సముద్రంలో వెళ్లారు. అయితే, తెల్లవారుజాము నుంచే సముద్రంలో విపరీతమైన గాలులు, అలజడులు ఉండటంతో వేటకు వెళ్లలేక వెనుదిరిగారు. కోట మండలం శ్రీనివాసపురం, గోవిందపల్లిపాళెం ముఖద్వారాల నుంచి మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లలేకపోయారు. భయంకరమైన అలలు, విపరీతమైన గాలులు వీస్తుండటంతో ఎక్కడ బోట్‌లు కొట్టుకుపోతాయోనని భయాందోళనకు గురై సముద్రం వద్దకెళ్లి కొంతమంది బోట్లను ముఖద్వారం వద్దకు తీసుకువచ్చారు. అయితే బాగా పొద్దుపోయేదాక 180 బోట్లకుగాను కేవలం మూడు మాత్రమే అలలు, గాలులకు లెక్క చేయకుండా సముద్రంలోకి వెళ్లినట్లు మత్స్యకారులు తెలిపారు. ఇక, చిల్లకూరు మండలం తమ్మినపట్నం, గుమ్మళ్లదిబ్బ ముఖద్వారాల నుంచి బోట్లు వెళ్లలేదు. వాకాడు మండలం కొండూరుపాలెం, తూపిలిపాలెం నుంచి అరకొరగా బోట్లు వెళ్లినట్లు సమాచారం. కాగా, సోమవారం నుంచి యథావిధిగా సముద్రంలో వేటసాగే అవకాశాలు ఉన్నాయని మత్స్యకారులు చెబుతున్నారు.


కోట మండలం గోవిందపల్లిపాళెం ముఖద్వారం నుంచి సముద్రంలోకి వెళ్తున్న బోట్


యువశ్రీకి కళాజ్యోతి జాతీయ పురస్కారం



పురస్కారాన్ని స్వీకరిస్తున్న యువశ్రీ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూన్ 15 (ఆంధ్రజ్యోతి): శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయం తెలుగు విభాగ అధ్యాపకుడు డాక్టర్ డి.యువశ్రీ కళాజ్యోతి జాతీయ పురస్కారాన్ని పొందారు. చిత్తూరులోని భారతీయ తెలుగు రచయితల సమాఖ్య - ఎంవీ కేశవరెడ్డి స్మారక ఫౌండేషన్ సంయుక్తంగా ఆదివారం ఈ పురస్కారాన్ని ప్రదానం చేశాయి. సామాజిక సేవ, సాహిత్య బోధన, పరిశోధనా కృషికి గుర్తింపుగా ఈ పురస్కారాన్ని అందజేశారు. సినీ నటుడు రాజేంద్రప్రసాద్, సినీ గాయకులు సుద్దాల అశోక్‌తేజ, మాజీ రాష్ట్రపతి సర్వేపల్లె రాధాకృష్ణన్ మనవడు సుబ్రమణ్యశర్మ చేతుల మీదుగా డాక్టర్ యువశ్రీ పురస్కాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా శాలువా, పుష్పగుచ్ఛం, జ్ఞాపిక, సర్టిఫికెట్‌తో ఆమెను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంవీ శ్రీధర్‌రెడ్డి, డాక్టర్ దేవేంద్రరావు, డాక్టర్ నారాయణస్వామి పాల్గొన్నారు.

సంపూర్ణ జీవితం - దేహమే భిషక్కు పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వక్తలు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూన్ 15 (ఆంధ్రజ్యోతి): రిటైర్డు ప్రిన్సిపాల్ డాక్టర్ గాలి గుణశేఖర్ రాసిన 'సంపూర్ణ జీవితం - దేహమే భిషక్కు' పుస్తకావిష్కరణ ఆదివారం తిరుపతిలో నిర్వహించారు. వేమన విజ్ఞాన కేంద్రంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. విశ్వశ్రీ సాహిత్య సమాఖ్య ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా అన్నమాచార్య ప్రాజెక్టు ప్రత్యేకాధికారి డాక్టర్ మేడసాని మోహన్ పాల్గొని ప్రసంగించారు. మనిషి జీవితానికి సంబంధించిన సారాన్ని ఈ పుస్తకం తెలియజేస్తుందన్నారు. జ్ఞానంతో పాటు ఎంతో అనుభవంతో రచయిత ఈ పుస్తకాన్ని రాశారని తెలిపారు. గాలి గుణశేఖర్ ఇటువంటి మరిన్ని విలువైన పుస్తకాలు రాయాలని కోరుకున్నారు. అనంతరం తొలి ప్రతిని సాహిత్య సేవకులు ఏనుగు అంకమ నాయుడుకు అందజేశారు. గౌరవ అతిథి మల్లారపు నాగార్జున మాట్లాడుతూ సామాజిక బాధ్యతను నెరవేర్చడం ద్వారా మనిషి జీవితం పరిపూర్ణమవుతుందని అభిప్రాయపడ్డారు. పుస్తక సమీక్ష చేసిన బీరం సుందరరావు మాట్లాడుతూ ఈ పుస్తకంలో మనిషి జీవితానికి అవసరమైన ఎన్నో విలువైన అంశాలు దాగున్నాయని తెలిపారు. అవధాని ఆముదాల మురళి సభా సమన్వయం చేశారు. అనంతరం రచయిత గాలి గుణశేఖర్‌ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో పొక్కళ్ల సుభద్ర, మన్నవ గంగాధర ప్రసాద్, నెమిలేటి కిట్టన్న, మల్లేశ్వరరావు, సాహిత్యాభిమానులు పాల్గొన్నారు.

నిత్య జీవితంలో యోగా భాగం కావాలి



తిరుచానూరు, జూన్ 15(ఆంధ్రజ్యోతి): నిత్య జీవితంలో యోగా ఒక భాగం కావాలని యోగా గురువులు చలపతి, నవీన్ అన్నారు. 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని తిరుచానూరు రోడ్డులోని శిల్పారామంలో ఆదివారం నుంచి ప్రత్యేక ఉచిత యోగా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. 21వ తేదీ వరకు ఉదయం 6 నుంచి 8 గంటల వరకు తరగతులు జరుగుతాయి. యోగా సాధనలో భాగంగా శ్వాస నియంత్రణ; ధ్యానం, శరీర సాధన వంటి అంశాలను యోగా గురువులు వివరించారు. అనంతరం అభ్యాసకులతో ప్రతిజ్ఞ చేయించారు.

మాతంగి వేషంలో మిట్టమీదగంగమ్మ

● భక్తిశ్రద్ధలతో అగ్నిగుండ ప్రవేశం



మాతంగి వేషధారణలో ఊరేగింపు

చంద్రగిరి, జూన్ 15(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మిట్టమీద గంగమ్మ జాతరలో భాగంగా ఆదివారం అమ్మవారు మాతంగి వేషంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయంలో ఉదయం అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు చేసి, మాతంగి వేషధారణగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. మాతంగి వేషధారణలో గ్రామోత్సవం నిర్వహించారు. సాయంత్రం భక్తులు అమ్మవారి కంకణాలు కట్టుకుని తడి బట్టలతో అగ్నిగుండ ప్రవేశం నిర్వహించారు. చంద్రగిరి రెడ్డి వీధి యువత అమ్మవారికి సారె సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మొక్కల చంద్రశేఖరరెడ్డి, ఉభయదారులు రాజశేఖర్‌నాయుడు, కార్తికేయ, హేమలత, నంద్యాల తేజప్రసాద్‌చందు పాల్గొన్నారు.

రెండిళ్లలో చోరీ

● 54 గ్రాముల బంగారు నగల అపహరణ



బీరువాల్లో చిందరవందరగా పడి ఉన్న బట్టలు

పాకాల, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెన్నుగారిపల్లె పంచాయతీ చెన్నుగారిపల్లె దళితవాడలో శనివారం రాత్రి రెండిళ్లలో చోరీ జరిగింది. 54 గ్రాముల బంగారు, 400 గ్రాముల వెండి నగలు అపహరించారు. వేణు, శ్రీనివాసులు తండ్రీ కొడుకులు. పక్కపక్కనే ఇళ్లు నిర్మించుకున్నారు. శనివారం ఎస్ఆర్‌పురంలో బంధువుల ఇంటికి వెళ్లారు. తాళాలు బాత్రూమ్‌లో పెట్టి వెళ్లగా గుర్తు తెలియని వ్యక్తులు తీసి వేణు ఇంట్లోని బీరువాలో 16 గ్రాముల బంగారు ఆభరణాలు, 150 గ్రాముల వెండి, శ్రీనివాసులు ఇంట్లో 38 గ్రాముల బంగారు. 250 గ్రాముల వెండి వస్తువులు తీసుకెళ్లిపోయారు. బాధితుల ఫిర్యాదు మేరకు పాకాల సీఐ సుదర్శన ప్రసాద్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ఉద్యోగులకిచ్చిన హామీలు అమలు చేయాలి

పాకాల, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): కూటమి నేతలు ఎన్నికల సమయంలో ఉద్యోగులకిచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని బహుజన టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కె.రామచంద్రయ్య, ప్రధాన కార్యదర్శి బి.రామమూర్తి డిమాండు చేశారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం బీటీఏ మండల శాఖ అధ్యక్షుడు కె.జ్యోతిప్రసాద్ అధ్యక్షతన కార్యవర్గ సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులకు సకాలంలో పీఆర్సీ అమలు చేస్తామని, అరియర్స్, పెండింగ్ డీఏ బకాయిలు, పీఎఫ్, సరెండర్ లీవ్ బకాయిలు చెల్లిస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. పీఆర్సీ ఆలస్యమైతే ఐఆర్ ప్రకటిస్తామని హామి ఇచ్చి ఏడాది గడిచినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే అమలు చేయకపోతే ఆందోళనబాట పట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో బీటీఏ జాతీయ ఉపాధ్యక్షుడు జి.ఆంజనేయులు, నాయకులు ఎస్.ఆదికేశవులు, జయబాల, కేఎస్ తులసీరామ్, కృష్ణమూర్తి, విజయమోహన్, వెంకటయ్య, శివ, రమణ, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించండి



ప్రచారం చేస్తున్న ఉపాధ్యాయులు

రామచంద్రాపురం, జూన్ 15(ఆంధ్రజ్యోతి): అనుపల్లె ఆదర్శ పాఠశాలలో పిల్లలను చేర్పించాలంటూ బొప్పరాజుపల్లెలో హెచ్ఎం దుర్గాప్రసాద్ ఆదివారం ఇంటింటికీ వెళ్లి తల్లిదండ్రులను కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో అర్హత కలిగిన ఉపాధ్యాయులతో నాణ్యమైన విద్యను అందిస్తున్నామన్నారు. తల్లికి వందనంతోపాటు స్కూల్ బ్యాగ్, యూనిఫాం, పాఠ్యపుస్తకాలు అందజేస్తోందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సోము, రమణారెడ్డి, విజయకుమార్, జవహర్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రైవేటు స్థలాల్లోని పూజా మందిరాలు ధ్వంసం చేస్తే కఠిన చర్యలు



ఎస్పీ హర్షవర్ధన రాజు

తిరుపతి(నేరవిభాగం), జూన్ 15(ఆంధ్రజ్యోతి): ప్రైవేటు స్థలాల్లోని పూజా మందిరాలను అనుమతి లేకుండా కూల్చినా.. ధ్వంసం చేసినా.. చట్టాలను తమ చేతుల్లోకి తీసుకుని ఇష్టారాజ్యంగా ప్రవర్తించినా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హర్షవర్ధన రాజు హెచ్చరించారు.తిరుపతిలో ఆదివారం ఆయన మీడియాతో మాటాలడుతూ.. రెండు రోజుల కిందట తిరుపతి రూరల్ దామినేడు వద్ద నాగాలమ్మ ఆలయాన్ని కృష్ణమూర్తి నాయుడు, అతడి అనుచరులు రాత్రికి రాత్రే ధ్వంసం చేసి శాంతి భద్రతలకు విఘాతం కలిగించడంపట్ల సీరియస్‌గా స్పందించారు. ఈ ఘటన వెనుక ఉన్న వారిని వదలి పెట్టే ప్రసక్తే లేదన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు స్థలాల్లోని ఆలయాలు, ఇతర పూజా మందిరాలు కూల్చాలంటే సంబంధిత న్యాయస్థానాలు లేదా కలెక్టర్ అనుమతి పొందాలన్నారు. ఈ రెండూ లేకుండా ధ్వంసం చేస్తే మాత్రం అవసరమైతే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. జైలుకూ పంపిస్తామన్నారు. అలాగే, తిరుచానూరు సమీపంలోని స్వర్ణముఖి నది ఒడ్డున ఉన్న వారాహి ఆలయాన్ని ధ్వంసం చేసిన ఘటనపైనా విచారించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు.

ఆకులో ఆకునై.. పువ్వులో పువ్వునై..!

● అలరించిన ఎస్పీ బాలు రెండో రోజు స్మారక సంగీత కచేరి ● ప్రత్యేక ఆకర్షణగా సినీ నటి ఇంద్రజ



బాలు గీతాలను ఆలపిస్తున్న గాయకులు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సినీ నటి ఇంద్రజ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ఆకులో ఆకునై.. పువ్వులో పువ్వునై.. కొమ్మలో కొమ్మనై.. నునులేత రెమ్మనై.. ఈ అడవిలో దాగిపోనా.. నేను ఇచటనే ఆగిపోనా.. అంటూ ప్రఖ్యాత గాయకుడు, దివంగత ఎస్పి బాలసుబ్రమణ్యం మళ్లీ భువికి దిగివచ్చి పాడినట్టుగా గాయకులు తమ అద్భుత స్వరంతో మరిపించారు. ఎస్పి బాలసుబ్రమణ్యం జయంతి సందర్భంగా తిరుపతి ఫిలిం సొసైటీ ఆధ్వర్యంలో మహతి కళా క్షేత్రంలో ఆదివారం సాయంత్రం రెండు రోజుల పాటు సాగిన సంగీత కచేరి ముగిసింది. ప్రఖ్యాత గాయకులు ఉదయ్‌భాస్కర్, సురభి, శృతి, శ్రావణి, స్నిగ్ధ, ప్రవస్థి, రేణుకుమార్, నరసింహ, తదితరులు బాలు పాడిన పాటలను ఆలపించి అందరినీ ఆకట్టుకున్నారు. దేవుళ్లు సినిమాలోని 'జయ జయ శుభకర', నేనున్నాను సినిమాలోని 'వేణు మాధవా', స్వాతి కిరణం సినిమాలోని 'అయిగిరి నందిని', మనసంతా నువ్వేలోని 'తూనీగా తూనీగా', మేజర్ చంద్రకాంత్‌లోని 'పుణ్యభూమి నాదేశం', సిరిసిరి మువ్వలోని 'ఝుమ్మంది నాదం', మేమ సందేశంలో 'ఆకులో ఆకునై', భైరవద్వీపంలో 'శ్రీతుంబుర నారద', సాగర సంగమంలో 'వేదం అణువణువున', మౌన మేలనోయి, నీలీల పాడెద దేవ వంటి పాటలతో అందరినీ అలరించారు. ఈ కార్యక్రమంలో సినీ నటి ఇంద్రజ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. అనంతరం తిరుపతి ఫిలిం సొసైటీ చైర్మన్ వేణుగోపాలరెడ్డి, అధ్యక్షులు వైఎస్ బాబు తదితరులు గాయనీ గాయకులను, అతిథులను సత్కరించారు.

ఎస్పీ బాలు స్వరం సజీవం : ఇంద్రజ

భౌతికంగా మన మధ్య లేకపోయినా సంగీత ప్రపంచంలో ఎస్‌పి బాలసుబ్రమణ్యం తన అద్భుత స్వరంతో సజీవంగా నిలిచిపోయారని సినీ నటి ఇంద్రజ పేర్కొన్నారు. రెండు రోజులుగా మహతి కళా క్షేత్రంలో నిర్వహించిన ఎస్పీ బాలు స్మారక సంగేత కచేరీ సమాపనోత్సవానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఎస్పీ బాలు పేరుతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో పాల్గొనడం అదృష్టంగా భావిస్తున్నట్టు చెప్పారు. సంగీత సామ్రాజ్యంలో బాలసుబ్రమణ్యం అజరామరుడని అన్నారు. పదహారు భాషల్లో పాడిన ప్రత్యేకత బాలు సొంతమన్నారు. బాలు స్థాయికి ఈ తరం గాయకులు ఎదగాలని ఆకాంక్షించారు. సభలో సినీ నిర్మాత యలమంచిలి ప్రవీణ్, యోగ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ యోగేష్, తిరుపతి ఫిలిం సొసైటీ చైర్మన్ వేణుగోపాలరెడ్డి, అధ్యక్షుడు వైఎస్ బాబు తదితరులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జనమిత్ర దిలీప్‌కుమార్‌రెడ్డి, తిరుపతి ఫిలిం సొసైటీ ఇన్‌చార్జి కార్యదర్శి శాంతావాణి, కోశాధికారి ప్రసాదరావు, సహాయ కార్యదర్శి షేక్ గుల్జార్, ఉపాధ్యక్షులు బుజ్జిబాబునాయుడు, బండి మధుసూదనరెడ్డి, శంకర్, మేరీజాయ్, రాజ్యలక్ష్మి, అనసూయ, భాస్కర్, సంస్థ సభ్యులు, సంగీత ప్రియులు పాల్గొన్నారు.

శ్రీశ్రీకి ఘన నివాళి



శ్రీశ్రీ చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న సాహితీవేత్తలు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మహాకవి శ్రీశ్రీ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళి అర్పించారు. ఆదివారం సాయంత్రం వేమన విజ్ఞాన కేంద్రంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. వేమన విజ్ఞాన కేంద్రం గౌరవ సలహాదారు టెంకాయల దామోదరం, కార్యదర్శి మల్లారపు నాగార్జున తదితరులు మాట్లాడారు. తెలుగు సమాజాన్ని తన సాహిత్యంతో చైతన్యపరిచిన గొప్ప కవి శ్రీశ్రీ అని కొనియాడారు. కవిత్వం, కథలు, నాటికలు, సినిమా పాటలు రాసి ఎంతో గొప్ప సాహిత్యాన్ని అందించారని తెలిపారు. నేటికీ తెలుగు సాహిత్య రంగంలో స్ఫూర్తి కలిగిస్తున్నారని చెప్పారు. తిరుపతితోనూ శ్రీశ్రీకి అనుబంధం ఉందని గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పలువురు సాహిత్యవేత్తలు, సాహిత్యాభిమానులు పాల్గొన్నారు.

■ అబ్బురం నృత్య ప్రదర్శన

తిరుచానూరు, జూన్ 15(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు రోడ్డులోని శిల్పారామంలో ఆదివారం భరత నాట్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. వారాంతపు సెలవులను పురస్కరించుకుని తమిళనాడు రాష్ట్రంలోని తిరునిన్రావూరుకు చెందిన శ్రీహర్ష నాట్య కేంద్రం చిన్నారులు బ్రహ్మమొక్కటే, వెంకటాచల నిలయ, చిన్నచూరు కన్నన్, నటేశ కౌస్తువం, దశావతారం, తీరుథ విళయాటు పిళ్ళై తదితర కీర్తనలకు నృత్యం చేశారు. శిల్పారామం ఏవో సుధాకర్ కళాకారులను సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో నృత్య శిక్షకురాలు సౌందరవల్లి, గిరిధరన్, ఏతు రాధాకృష్ణ పాల్గొన్నారు.







పట్టించుకోండి సారూ..!

అవిలాల గ్రామ పంచాయతీలోని గంగమ్మగుడి వీధి వెనుక కొన్ని రోజుల క్రితం తాగునీటి సరఫరా కోసం గుంతలు తీశారు. అసలే చిన్న సందు కావడం, పనులు నత్తనడకన సాగుతుండడంతో వాహనదారులు, పాదచారులు అవస్థలు పడుతున్నారు. ఇప్పటికే పలువురు ఆ గోతుల్లో పడి గాయాలపాలయ్యారు. అధికారులు స్పందించాలని కోరుతున్నారు.

- తిరుపతి(ఎమ్మార్‌పల్లె)

బారులు తీరిన 'మామిడి' ట్రాక్టర్లు

గంగాధరనెల్లూరు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లా గంగాధరనెల్లూరు పంచాయతీ 100 గొల్లపల్లెలోని జైన్‌ఫ్యాక్టరీ వద్ద ఆదివారం తోతాపురి మామిడి కాయల లోడు ట్రాక్టర్లు బారులు తీరాయి. మామిడి కాయల పర్మిట్లకు సంబంధించి రైతులుశనివారం ఫ్యాక్టరీ ఎదురుగా చిత్తూరు - పుత్తూరు రహదారిపై నిరసన వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. దీంతో డీఆర్‌డీఏ పీడీ శ్రీదేవి ఉన్నతాధికారులకు రైతుల పరిస్థితి వివరించారు. ఫలితంగా ఆదివారం వరకు పర్మిట్లతో మామిడికాయల తరలింపునకు అనుమతిస్తామన్నారు. ఈక్రమంలో ఆదివారం ఉదయానికే మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులే కాకుండా, ఇతర మండలాల రైతులు కూడా పోటీ పడుతున్నారు. మామిడికాయల ట్రాక్టర్లను క్యూలో పెడుతున్నారు. చిత్తూరు-పుత్తూరు రోడ్డు పక్కన సుమారు 200 ట్రాక్టర్లకు పైగా ట్రాక్టర్లు బారులు తీరి ఉన్నాయి.

దాడిలో గాయపడిన యువకుడి మృతి

తిరుపతి(నేరవిభాగం), జూన్ 15(ఆంధ్రజ్యోతి): జీవకోన క్రాంతినగర్‌కు చెందిన తోటి స్నేహితులు మద్యం తాగి ఒకరినొకరు ఘర్షణ పడి.. మరొకరిపై హత్యాయత్నానికి పాల్పడ్డారు. ఈ ఘటనలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మణి ఆదివారం మృతి చెందాడు. అలిపిరి ఎస్‌ఐ లోకేష్‌బాబు చెప్పిన ప్రకారం.. జీవకోనకు చెందిన వసంత కుమారుడు మణి.. గురువారం సాయంత్రం జీవకోన ఆలయం వద్దకు వెళ్లి మద్యం తాగి పడుకున్నాడు. క్రాంతినగర్‌కు చెందిన తోటి స్నేహితులు బి.శివప్రసాద్ రెడ్డి, దిలీప్‌కుమార్, కె.విజయకుమార్ అక్కడకు వెళ్లగా.. మళ్లీ వారితో కలసి మణి మద్యం తాగాడు. ఈ క్రమంలో ఒకరినొకరు ఘర్షణ పడ్డారు. ఈ ఘటనలో మణిపై హత్యాయత్నానికి పాల్పడ్డారు. స్థానికులు వెళ్లడంతో వారు పరారయ్యారు. తీవ్రంగా గాయపడిన మణిని చికిత్స నిమిత్తం రుయాకు తరలించారు. రెండు రోజులుగా చికిత్స పొందుతూ ఆదివారం మణి మృతి చెందాడు. దీంతో ఈ ఘటనను హత్య కేసుగా ఎస్‌ఐ నమోదు చేశారు.

ఏడాది పాలనలో అన్నీ మోసాలే: వైసీపీ



బుక్‌లెట్ ఆవిష్కరిస్తున్న వైసీపీ నేతలు

తిరుపతి(జీవకోన), జూన్ 15 (ఆంధ్ర జ్యోతి): ఏడాది పాలనలో ప్రభుత్వం అన్నీ మోసాలే చేసిందని వైసీపీ జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకర్‌రెడ్డి ఆరోపించారు. తిరుపతిలో ఆదివారం ప్రభుత్వ ఏడాది పాలన వైఫల్యాలపై బుక్‌లెట్ విడుదల చేసి మాట్లాడారు. ప్రశ్నించేవారిపై కేసులు పెట్టి జైళ్లలో పెడుతున్నారని విమర్శించారు. బడుల్లో ఒక బాత్రూం కూడా కట్టించకుండా ఒక్కొక్కరి దగ్గర రూ.2వేలు నొక్కేశారని మాజీ మంత్రి రోజా ఆరోపించారు. సమావేశంలో మేయర్ శిరీష, ఎమ్మెల్సీలు సిపాయి సుబ్రహ్మణ్యం, భరత్, మాజీ ఎమ్మెల్యేలు వెంకటేగౌడ, సునీల్, విజయానందరెడ్డి, పార్లమెంటు పరిశీలకుడు రాజశేఖర్, రాజేష్ పాల్గొన్నారు.

రాష్ట్ర మంత్రికి ఘన స్వాగతం



జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు ఆదివారం రాత్రి విమానాశ్రయంలో కలెక్టర్ వెంకటేశ్వర్, కమిషనర్ మౌర్య, తుడా చైర్మన్ దివాకర్ రెడ్డి, కార్పొరేటర్ అన్నా అనిత, టీడీపీ నేత కోడూరు బాలసుబ్రమణ్యం తదితరులు స్వాగతం పలికారు.



తిరుపతి మాజీ ఎమ్మెల్యే మోహన్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్న రఘు యాదవ్, శంకర్ యాదవ్, రాఘవేంద్ర, చెంగయ్య, సిద్ధు, ఉమాపతి

ముగిసిన ఎస్జీటీల బదిలీ కౌన్సెలింగ్

● నేటి నుంచి పూర్తిస్థాయిలో పాఠశాలలకు ఉపాధ్యాయులు



ఎస్జీటీల బదిలీ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న విద్యాశాఖ అధికారులు

చిత్తూరు సెంట్రల్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లా టీచర్ల పదోన్నతులు, బదిలీల కౌన్సెలింగ్ ప్రక్రియ స్థానిక పర్మన్ మెమోరియల్ పాఠశాలలో ఆదివారం మధ్యాహ్నం 3.30 గంటలకు ముగిసింది. 3,334 మంది ఎస్జీటీలను బదిలీలు చేశారు. వీరిలో.. 3,095 మంది తెలుగు, 49 మంది తమిళం, 190 మంది ఉర్దూ ఉన్నారు. చివరి రోజున మైనర్ మీడియాగా పిలువబడే తమిళం, ఉర్దూలకు బదిలీ కౌన్సెలింగ్ నిర్వహించారు. స్పౌజ్ కేసుల్లో అక్కడక్కడా కొంత గందరగోళం నెలకొనగా, డీఆర్వో మోహన్ కుమార్ జోక్యం చేసుకుని పరిస్థితి సర్దుబాటు చేశారు. పరిస్థితులు తీవ్రతరమైనప్పుడు ఆర్జేడీ, జిల్లా పరిశీలకుడు శామ్యూల్ దగ్గరుండి సమస్యలు పరిష్కరించారు. ఈనేపథ్యంలో ఉపాధ్యాయ సంఘాల నేతల్ని కొంతదూరం పెట్టడంపై అభ్యంతరాలు వచ్చాయి. అయినా కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశాలతో డీఆర్వో ఆధ్వర్యంలో కొంత కఠినమైన నిర్ణయాలు తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడినట్లు విద్యాశాఖ వర్గాలు తెలిపాయి. కాగా, డీఈవో పూల్‌లోని లాంగ్వేజ్ పండిట్ (ఎస్జీఈ/పీఈటీ)లకు సైతం క్లియర్ వేకెన్సీలు చూపి, వెబ్ ఆప్షన్ ద్వారా పనిచేసే స్థానాలు కేటాయించారు. అయితే తమకు అన్యాయం జరిగిందని, వెబ్ ద్వారా కాకుండా మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించాలని లాంగ్వేజ్ పండిట్‌లు డీఈవో వరలక్ష్మికి విజ్ఞప్తి చేశారు. వెబ్ కౌన్సెలింగ్‌లో ఇప్పటికే మీరు బదిలీ కావడం వల్ల మ్యానువల్ కౌన్సెలింగ్ చేపట్టలేమని ఆమె స్పష్టం చేశారు.

గతనెల 21 నుంచి మొదలైన ప్రక్రియ

గతనెల 21న మొదలైన హెచ్ఎంల బదిలీల ప్రక్రియ 30వ తేదీకి, స్కూల్ అసిస్టెంట్ల బదిలీలు జూన్ 4వ తేదీకి ముగిసింది. స్కూల్ అసిస్టెంట్ల నుంచి గ్రేడ్-2 హెచ్ఎంల పదోన్నతి ప్రక్రియ గత నెల 31వ తేదీ నాటికి, ఎస్జీటీల నుంచి స్కూల్ అసిస్టెంట్ పదోన్నతి ప్రక్రియ ఈ నెల 6వ తేదీకి ముగిసింది. కాగా, ఎస్జీటీల బదిలీలను ప్రభుత్వం వెబ్ ఆప్షన్ ద్వారా నిర్వహించాలని భావిస్తే, ఉపాధ్యాయ సంఘాల నేతలు వ్యతిరేకించారు. మాన్యువల్ విధానంలో నిర్వహించాలని కోరారు. ఈ క్రమంలో విద్యాశాఖ సైతం మ్యానువల్ కౌన్సెలింగ్‌కు ఆమోదం తెలపడంతో ఈనెల 7న జరగాల్సిన ఎస్జీటీల బదిలీ ప్రక్రియ మూడు మూడ్రోజుల ఆలస్యంగా 10వ తేదీన ప్రారంభమై ఆదివారంతో ముగిసింది.

8301 మంది బదిలీలు, 339 మందికి పదోన్నతులు

8,301మంది టీచర్లు బదిలీ కాగా,339మంది పదోన్నతులు పొందారు. ఇందులో 167హెచ్ఎంలకు, 4,800స్కూల్ అసిస్టెంట్లు, 3,334 సెకండరీ గ్రేడ్ టీచర్లకు బదిలీలు కాగా, 186 మంది స్కూల్ అసిస్టెంట్లకు గ్రేడ్-2 హెచ్ఎంలుగా, 153 మంది సెకండరీ గ్రేడ్ టీచర్ల నుంచి స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి పొందారు. సోమవారం నుంచి ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో టీచర్లు పూర్తి స్థాయిలో విధులకు హాజరు కానున్నారు. ఈ ప్రకియలో తిరుపతి డీఈవో కుమార్‌తోపాటు చిత్తూరు, తిరుపతి జిల్లాల విద్యాశాఖ ఏడీలు, టెక్నికల్ టీం,సూపరింటెండెంట్లు, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పేద పిల్లల విద్యాభివృద్ధికే తల్లికి వందనం

యాదవ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ నరసింహయాదవ్



మీడియా సమావేశంలో తల్లికి వందనం లబ్ధిదారులతో నరసింహయాదవ్, మునికృష్ణ

తిరుపతి(వైద్యం), జూన్ 15(ఆంధ్రజ్యోతి): పేద కుటుంబాల్లోని పిల్లలను విద్యావంతులను చేసేందుకే ప్రభుత్వం తల్లికి వందనం పేరుతో ఆర్థిక సాయం అందిస్తోందని యాదవ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ నరసింహయాదవ్ పేర్కొన్నారు. ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఇంట్లో ఒక్క బిడ్డకు మాత్రమే అమ్మఒడి పథకం కింద ఆర్థిక సాయం అందించేవారని, ఇప్పుడు ఎంత మంది చదువుకునే బిడ్డలు ఉంటే అందరికీ ఇస్తున్నామని చెప్పారు. దీన్ని చూసి ఓర్వలేక వైసీపీ నేతలు తప్పుడు ప్రచారం చేస్తున్నారని దుయ్యబట్టారు. ఐదేళ్లపాటు రాష్ట్రాన్ని దోచుకున్న వారు ఇప్పుడు జరుగుతున్న సంక్షేమం, అభివృద్ధిని చూసి తట్టుకోలేకపోతున్నారని విమర్శించారు. గతంలో వైసీపీ ప్రభుత్వం రాష్ట్రంలోని 42,61,965 మంది తల్లులకు అమ్మఒడి అందిస్తే ప్రస్తుత ప్రభుత్వం 67,27,164 మందికి తల్లికి వందనం ఇస్తోందని వెల్లడించారు. అది కూడా పాఠశాలలు తెరిచిన రోజునే అందించడం గొప్ప విషయమన్నారు. డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ మాట్లాడుతూ బడికి వెళ్లే పిల్లలకు అమలు చేసే పథకాల్లోనూ వైసీపీ నేతలు వేల కోట్లు దోచుకుని ఇప్పుడు విమర్శలు చేయడం సరికాదన్నారు. ఎవరెన్ని విమర్శలు చేసినా తమ ప్రభుత్వం ఇచ్చిన ప్రతి హామీనీ అమలు చేస్తుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో టీడీపీ మీడియా కోఆర్డినేటర్ శ్రీధర్‌వర్మ, నగర ఆర్గనైజింగ్ కార్యదర్శి జ్ఞానశేఖర్ పాల్గొన్నారు.



గుంతలమయంగా ఉన్న రోడ్డు - చేతికి అందేంత ఎత్తులో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

శ్రీనగర్‌కాలనీ రోడ్లన్నీ గుంతలమయం

తిరుపతి(జీవకోన), జూన్ 15(ఆంధ్రజ్యోతి): జీవకోన పరిధిలోని శ్రీనగర్‌కాలనీ రోడ్లన్నీ(మొదటి లైన్ వద్ద) గుంతలమయంగా మారాయి. మొదటి లైన్‌లో రోడ్డుకు ఇరువైపులా రెండు వీధుల్లో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. పైపులైన్ల ఏర్పాటుకు రోడ్లన్నీ తవ్వేసి వదిలేశారు. ఇప్పటి వరకు సంబంధితశాఖ అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం. దీంతో స్థానికుల ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా రాత్రి సమయాల్లో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గుంతలు లేకుండా(ప్యాచ్ వర్క్) పనులు చేపట్టాలని వీరు కోరుతున్నారు. ఓ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చేతికి అందేంత ఎత్తులో ఉంది. ఏమరపాటుగా వెళ్లినా ప్రమాదం సంభవించే అవకాశముంది. విద్యుత్‌శాఖ అధికారులు స్పందించి ఈ సమస్యను పరిష్కరించాల్సి ఉంది.

మోహిత్‌కు హైందవ ధర్మం గురించి మాట్లాడే అర్హత లేదు


మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఈశ్వర్‌రెడ్డి

తిరుపతి(వైద్యం), జూన్ 15(ఆంధ్రజ్యోతి): తిరుపతి పరిసర ప్రాంతాల్లోని దేవాలయ, మఠం భూములను ఆక్రమించడమే కాకుండా పవిత్రమైన శ్రీవారి లడ్డూ ప్రసాదాలను నియోజకవర్గమంతా పప్పూబెల్లాల్లా పంచి పెట్టిన వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మోహిత్‌రెడ్డికి హైందవ ధర్మం గురించి మాట్లాడే అర్హత లేదని టీడీపీ తిరుపతి రూరల్ మండలాధ్యక్షుడు ఈశ్వర్‌రెడ్డి విమర్శించారు. ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ దామినేడులో టీడీపీ నేతలు హైందవ ధర్మాన్ని కించపరిచారని చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. మీ ప్రభుత్వ హయాంలో తిరుమలలో క్రైస్తవ మత ప్రచారాలు చేసినప్పుడు హైందవ ధర్మం గుర్తు రాలేదా అని నిలదీశారు. కూటమి ప్రభుత్వంపై ప్రజలు వ్యతిరేకతతో ఉన్నారని చెబుతున్న మోహిత్ దానికి కారణాలు కూడా చెప్పాలన్నారు. మహిళలకు ఉచితంగా మూడు సిలిండర్లు ఇచ్చినందుకా, పెన్షన్ రూ.3 వేల నుంచి రూ.4 వేలకు పెంచినందుకా, ల్యాండ్ టైటలింగ్ యాక్టును రద్దు చేసినందుకా, తల్లికి వందనం ఇచ్చినందుకా దేనికో చెప్పాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే నానీపై విమర్శలు చేస్తే ఊరుకునేది లేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు శ్రీనివాసులరెడ్డి, మధుశేఖర్, మధు, సుధాకర్ పాల్గొన్నారు.

కాలువ నిర్మాణం పూర్తి చేయండి



సుబ్బారెడ్డినగర్ వద్ద అసంపూర్తిగా ఉన్న కాలువ నిర్మాణం

తిరుపతి(జీవకోన), జూన్ 15(ఆంధ్రజ్యోతి): సుబ్బారెడ్డినగర్ వద్ద అసంపూర్తిగా ఉన్న కాలువ నిర్మాణం పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు. తిరుపతి-కరకంబాడీ రోడ్డులో వీఐపీల తాకిడి ఎక్కువగా ఉంటుంది. విమానాశ్రయం నుంచి తిరుమలకు ఇదే మార్గంలో వెళుతూ ఉంటారు. అలాంటి రహదారిలో పెద్దకాలువ నిర్మాణం కోసం పనులు చేపట్టి అర్థాంతరంగా వదిలేశారు. రాత్రి సమయాల్లో వాహనదారులు ఏమరపాటుగా వెళితే ప్రమాదాలకు గురయ్యే అవకాశముంది. అధికారులు స్పందించి నిర్మాణం పూర్తి చేయాల్సి ఉంది.

పీహెచ్‌సీలో ఆటాపాటపై విచారణ

తిరుపతి(వైద్యం), జూన్ 15(ఆంధ్రజ్యోతి): రోగులకు వైద్యసేవలు అందించే ఆస్పత్రిలో బయటి వ్యక్తులతో కలిసి సిబ్బంది డ్యాన్సులు వేసిన విషయంపై విచారణ చేపట్టి అందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్‌వో బాలకృష్ణనాయక్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నాగలాపురం ప్రాథమిక వైద్యశాలలో కొందరు సిబ్బంది బయటి వ్యక్తులతో కలిసి డ్యాన్సులు వేయడంపై ఆదివారం ఆంధ్రజ్యోతిలో నాగలాపురం పీహెచ్‌సీలో ఆటాపాట శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించిన ఆయన ఈ విషయంపై విచారణ చేపట్టారు.

బదిలీల్లో భాషా పండితులకు అన్యాయం

తిరుపతి(విద్య), జూన్ 15(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ బదిలీల్లో భాషా పండితులకు తీవ్ర అన్యాయం జరిగిందని రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ (ఎస్‌ఎల్‌టీఏ) ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దొడ్డ ఉమామహేశ్వర్, సిబ్బాల కిరణ్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సీనియారిటీ ప్రకారం ప్రాధాన్యతా క్రమంలో వెబ్ ఆప్షన్ పెట్టుకున్నప్పటికీ వారు కోరుకున్న పాఠశాలలు కాకుండా దూర ప్రాంతాలకు పోస్టింగ్ రావడం, సీనియారిటీ జాబితాలో చివరిలో ఉన్న వారికి సమీపంలో ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు. దీనివల్ల మిగిలిపోయిన భాషా పండితులు ఆవేదనకు గురవుతున్నారని పేర్కొన్నారు. వెబ్ కౌన్సెలింగ్ ద్వారా జరిగిన బదిలీలను తక్షణం రద్దుచేసి మాన్యువల్‌గా నిర్వహించి భాషా పండితులకు న్యాయం చేయాలని కోరారు.

రక్తదానం


రక్తదానం చేస్తున్న నారాయణ విద్యా సంస్థల సిబ్బంది

తిరుపతి(విద్య), జూన్ 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ జన్మదినం సందర్భంగా ఆదివారం తిరుపతిలోని నారాయణ విద్యాసంస్థల సిబ్బంది రక్తదానం, అన్నదానం చేశారు. విద్యాసంస్థల డీజీఎం కొండలరావు ఆధ్వర్యంలో ఎమ్మార్‌పల్లెలోని నారాయణ ఒలంపియాడ్‌పాఠశాలలో రక్తదానం చేశారు. రేణిగుంట అభయక్షేత్రంలో మానసిక వికలాంగులకు ఆహార పదార్థాలను అందజేశారు. తిరుపతి రుయా ఆసుపత్రిలో అన్నదానం చేశారు.

సమస్యల పరిష్కారానికి పోరాటాలే శరణ్యం

తిరుపతి(ఆటోనగర్), జూన్15 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కారం పోరాటాలతోనే సాధ్యమని సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి పేర్కొన్నారు. ఎమ్మార్‌పల్లెలో ఆదివారం ఆయన పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభలో మాట్లాడుతూ సీపీఐ ఆవిర్భావం నుంచి ప్రజా సమస్యలను పరిష్కరించి ప్రజల గుండెల్లో నిలిచిందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో భాగంగా వందల సంఖ్యలో పార్టీ నాయకులు ప్రాణత్యాగాలు చేశారని వివరించారు. సీతమ్మనగర్‌కు తమ పార్టీ అండగా ఉంటుందని వెల్లడించారు. ఏపీ ప్రజానాట్య మండలి కళాకారులు తమ పాటలతో ఆకట్టుకున్నారు. సమావేశంలో నాయకులు సి.పెంచలయ్య, జె.విశ్వనాథం, నాగరాజు, శ్రీనివాసులు, మునస్వామి, బలరాం పాల్గొన్నారు.

104 ఉద్యోగుల నూతన కార్యవర్గం

తిరుపతి(ఆటోనగర్), జూన్15(ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లా 104 ఉద్యోగుల కమిటీ సమావేశం యశోదానగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అమర్నాథ్, కార్యదర్శిగా రుద్ర, కోశాధికారిగా భువనేశ్వరి, ఉపాధ్యక్షులుగా యశ్వంత్, సహాయ కార్యదర్శిగా దివాకర్, కార్యనిర్వాహణ కార్యదర్శులుగా అశోక్, రుషేంద్ర ఎన్నికయ్యారు. డివిజన్ కార్యదర్శులుగా తిరుపతికి యోగేంద్ర, సురేష్, పిచ్చాటూరుకు చెంచురాజు, నాయుడుపేటకు రమణ కోటి ఎన్నికయ్యారు. అంతకుముందు కమిటీ సమావేశంలో ఉద్యోగుల సమస్యలపై చర్చ జరిగింది.

వ్యాపారులకు న్యాయం చేయకపోతే ఆందోళన ఉధృతం



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న వ్యాపారుల పిల్లలు

తిరుపతి(ఆటోనగర్), జూన్ 15: శ్రీవారి మెట్టు వ్యాపారులకు న్యాయం చేయకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని అఖిల పక్ష నాయకులు స్పష్టం చేశారు. కపిలతీర్థం రోడ్డులోని టీటీడీ పరిపాలన భవనం ఎదుట 300 రోజులుగా దీక్షలు చేస్తున్న వ్యాపారులకు సంఘీభావంగా సీఐటీయూ నేతలు కందారపు మురళి, బాలసుబ్రమణ్యం, ఎస్.జయచంద్ర, పి.మునిరాజా, బాధితుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. వీరికి మాంగాటి గోపాల్ రెడ్డి(కాంగ్రెస్), పి.అంజయ్య(ఆర్‌పీఐ), నీరుగట్టు నగేష్(ఆమ్‌ఆద్మీపార్టీ), ఎన్‌డీ రవి(సీపీఐ), వి.నాగరాజు(సీపీఎం) మద్దతు తెలిపారు. నాయకులు మాట్లాడుతూ వ్యాపారుల సమస్యను పరిష్కరిస్తామని టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు హామీ ఇచ్చి రోజులు గడుస్తున్నా ఇంతవరకు పట్టించుకోలేదన్నారు. కూటమి ప్రభుత్వంతో టీటీడీలో పేదలకు న్యాయం జరుగుతుందని భావించామని, కానీ పాలన అందుకు విరుద్ధంగా జరుగుతోందని విమర్శించారు. తమ కుటుంబాలకు న్యాయం చేయాలని పిల్లలు ప్లకార్డులు ప్రదర్శించారు. ఐద్వా జిల్లా కార్యదర్శి పి.సాయిలక్ష్మి, ఆప్కాస్ రాష్ట్ర అధ్యక్షుడు చినబాబు, జీ నాగవెంకటేష్, చిట్టిబాబు, మధు,యుగంధర్, ప్రకాష్ పాల్గొన్నారు.

కలెక్టర్, ఎమ్మెల్యే చొరవతో సమసిన దామినేడు వివాదం

నాగాలమ్మ ఆలయ పునర్నిర్మాణానికి ముందుకు వచ్చిన కృష్ణమూర్తినాయుడు


ఇరువర్గాలతో మాట్లాడుతున్న ఆర్డీవో రామ్మోహన్

తిరుపతి(కలెక్టరేట్), జూన్15(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం తిరుచానూరు పంచాయతీ దామినేడు గ్రామంలో నాగాలమ్మ పుట్ట, ఆలయ ప్రహరీ గోడ కూల్చివేయడంతో రేగిన వివాదం కలెక్టర్ వెంకటేశ్వర్, ఎమ్మెల్యే పులివర్తి నానీ చొరవతో సమసిపోయింది. కలెక్టర్, ఎమ్మెల్యే ఆదేశాల మేరకు తిరుపతి ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో రామ్మోహన్ ఆదివారం దామినేడు గ్రామస్థులు, నాగాలమ్మ పుట్టను కూల్చివేసిన కృష్ణమూర్తినాయుడితో చర్చించారు. నాగాలమ్మ పుట్ట ఉన్న ప్రాంతంలో ప్రహరీ గోడను యథాతథంగా ఏర్పాటు చేయాల్సిందిగా ఆర్డీవో ఆదేశించారు. అందుకు కృష్ణమూర్తి నాయుడు సమ్మతించాడు. నెల రోజుల్లోపు నిర్మిస్తానని కృష్ణమూర్తినాయుడు చెప్పడంతో వివాదానికి తెరపడింది. దీంతో గ్రామస్థులు ఎమ్మెల్యేకు, కలెక్టర్‌కు, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. పోలీస్ పికెట్ కూడా ఎత్తేశారు. కార్యక్రమంలో చంద్రగిరి డీఎస్పీ ప్రసాద్ పాల్గొన్నారు.

రిటైర్డు ఆర్మీ ఉద్యోగి ఇంట్లో చోరీ

బంగారు నగలు, పంచలోహ విగ్రహాల అపహరణ


చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న పోలీసులు

తిరుపతి(నేరవిభాగం), జూన్ 15(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం పేరూరులోని రిటైర్డు ఆర్మీ ఉద్యోగి ఇంట్లో దొంగలు పడ్డారు. బంగారు నగలు, వెండి వస్తువులు, పంచలోహ విగ్రహాలను అపహరించారు. బాధితుడు ఆదివారం రూరల్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు... పేరూరులో రిటైర్డు ఆర్మీ ఉద్యోగి లక్ష్మయ్య, లక్ష్మీదేవి దంపతులు కాపురముంటున్నారు. హైదరాబాదులో ఉంటున్న కుమార్తెను చూడడానికి గతనెల 17వ తేదీన వెళ్లారు. ఈ క్రమంలో దుండగులు లక్ష్మయ్య ఇంటికి వేసిన తాళం పగులగొట్టి బీరువాలోని 10 గ్రాముల బంగారు నగలు, 900 గ్రాముల వెండి ఆభరణాలు, పంచలోహ విగ్రహాలను తీసుకెళ్లారు. లక్ష్మయ్య దంపతులు ఆదివారం హైదరాబాదు నుంచి తిరిగి రాగా ఇంటి తలుపులు తీసి ఉండడంతో లోనికెళ్లి చూశారు. బీరువా తాళాలు తీసి ఉండడంతో చోరీ జరిగిందని నిర్ధారించుకుని తిరుపతి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ చిన్నగోవిందు కేసు నమోదు చేసి, ఘటనా స్థలాన్ని పరిశీలించారు. వేలిముద్రలు సేకరించారు.

నాగేంద్రప్రసాద్‌కు సన్మానం


నాగేంద్రప్రసాద్‌ను సన్మానిస్తున్న మాజీ సర్పంచ్ అన్నా మల్లీశ్వరి, స్థానికులు

తిరుపతి(జీవకోన), జూన్ 15(ఆంధ్రజ్యోతి): తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ టౌన్‌ప్లానింగ్ విభాగంలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తూ ఇటీవల ఉద్యోగ విరమణ పొందిన నాగేంద్రప్రసాద్‌ను జీవకోన వాసులు ఆదివారం ఘనంగా సన్మానించారు. గతంలో ఆయన జీవకోన(రాజీవ్‌నగర్ పంచాయతీ) కార్యదర్శిగా పనిచేసేటప్పుడు ప్రజలతో మమేకమై మంచిపేరు తెచ్చుకున్నారు. ఆయన సేవలను గుర్తు చేసుకుంటూ సన్మానించారు. కార్యక్రమంలో జీవకోన మాజీ సర్పంచ్ అన్నా మల్లీశ్వరి, ధనశేఖర్, రవివర్మ పాల్గొన్నారు.

రైల్వే జీఎంకు ఘన స్వాగతం


జీఎంకు స్వాగతం పలుకుతున్న అధికారులు

తిరుపతి (సెంట్రల్), జూన్ 15 (ఆంధ్రజ్యోతి): దక్షిణ కోస్తా రైల్వే నూతన జనరల్ మేనేజరు సందీప్ మాథూర్‌కు రేణిగుంటలో ఆదివారం రాత్రి ఘన స్వాగతం లభించింది. విశాఖపట్నం నుంచి ఆయన పూరీ ఎక్స్‌ప్రెస్‌లో ఆదివారం రాత్రి రేణిగుంటకు చేరుకున్నారు. గుంతకల్లు డివిజన్ అదనపు డివిజన్ మేనేజరు సుధాకర్, సీనియర్ డీఓఎం డాక్టర్ శ్రావణ్, తిరుపతి స్టేషన్ డైరెక్టర్ కుప్పాల సత్యనారాయణ పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు.

మాజీ ఎమ్మెల్యేకు జన్మదిన శుభాకాంక్షలు


మోహన్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ తదితరులు

తిరుపతి, జూన్15(ఆంధ్రజ్యోతి) : తిరుపతి మాజీ ఎమ్మెల్యే మోహన్ జన్మదినం సందర్భంగా ఆదివారం పలువురు ఆయన నివాసానికి చేరుకుని శుభాకాంక్షలు తెలిపారు. కేక్ కట్ చేసి పంచిపెట్టారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో తుడా మాజీ చైర్మన్ ఎన్వీ ప్రసాద్, టీటీడీ మాజీ డిప్యూటీ ఈవో చిన్నంగారి రమణ, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, టీడీపీ నాయకులు ఊకా విజయకుమార్, పులుగోరు మురళి, మహేష్ యాదవ్, సుబ్బు యాదవ్, శంకర్ యాదవ్, రూపేష్, జిమ్ ప్రకాష్, మునికృష్ణ, వ్యాపారవేత్త ప్రభాకర్, చెన్నూరు సుబ్రమణ్యం పాల్గొన్నారు.

శ్రీవారి సర్వదర్శనానికి 16 గంటలు

తిరుమల, జూన్15(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 16 గంటల సమయం పడుతోంది. ఆదివారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 9 షెడ్లలో సర్వదర్శన భక్తులు నిండిపోయారు. క్యూలైన్ కృష్ణతేజ విశ్రాంతి భవనం మీదుగా రింగురోడ్డులో శిలాతోరణం సర్కిల్ వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

శుక్రవారం హుండీ ఆదాయం: రూ.3.80 కోట్లు

శనివారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 91,720

తలనీలాలు సమర్పించినవారు: 44,678

పశువుల దాహార్తి తీరుస్తున్న నీటి తొట్టెలు


బాదూరు వద్ద ఏర్పాటు చేసిన నీటి తొట్టె

రామచంద్రాపురం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఇటీవల ఉపాధి నిధులతో ఏర్పాటు చేసిన నీటి తొట్టెలు పశువుల దాహార్తిని తీరుస్తున్నాయి. వేసవి కాలం అడవుల్లో మేతకువెళ్లిన పశువులు నీటి కోసం అల్లాడేవి. వర్షాకాలం సాయంత్రం వరకు ఉండే పశువులు, వేసవి కాలం మధ్యాహ్నం లోపు నీరందక ఇళ్లకు చేరేవి. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఎమ్మెల్యే పులివర్తి నాని మండలంలో 75 నీటి తొట్టెల ఏర్పాటుకు నిధులు మంజూరు చేయించారు. ఇప్పటివరకు 62 తొట్టెలు పూర్తయ్యాయి. దీంతో పశువుల దాహార్తి తీర్చినట్లయింది.

వైభవంగా రేణుకా ఎల్లమ్మ తిరునాళ్ల


అమ్మవారికి సారె తీసుకువస్తున్న మోహన్‌బాబునాయుడు

రామచంద్రాపురం, జూన్ 15(ఆంధ్రజ్యోతి): గంగిరెడ్డిపల్లి దళితవాడ రేణుకా ఎల్లమ్మ తిరునాళ్లలో భాగంగా ఆదివారం గోవింద నామస్మరణ మధ్య అగ్నిగుండ ప్రవేశం వైభవంగా జరిగింది. ఆలయంలో అమ్మవారి ఉత్సవమూర్తికి తిరుమంజనం నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేపట్టారు. సాయంత్రం ఉత్సవమూర్తిని మేళతాళాల నడుమ ఊరేగించారు. భక్తులు పొంగళ్లు పెట్టి మొక్కులు చెల్లించుకున్నారు. రాత్రి ఉత్సవమూర్తిని అగ్నిగుండం వద్ద కొలువుదీర్చారు. అనేక ఉపచారాల అనంతరం ఆలయ పూజారి అగ్నిగుండ ప్రవేశం చేయడంతో ఆయన వెంట పలువురు భక్తులు అగ్నిగుండంలోకి ప్రవేశించారు. కమ్మకండ్రిగ గ్రామానికి మచ్చా మోహన్‌బాబునాయుడు, హరినాయుడు అమ్మవారికి సారె సమర్పించి ఉభయదాతలుగా వ్యవహరించారు. గ్రామపెద్దలు సుబ్బరాయుడు, లోకనాథం, రాజా, బాబు పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో న్యాయమూర్తులు


జస్టిస్ హరీష్ టాండన్, దీక్షిత్ కృష్ణశ్రీపాద్ - మధుసూదన్‌రావు



తిరుమల, జూన్15(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని ఆదివారం పలువురు న్యాయమూర్తులు దర్శించుకున్నారు. ఒడిశా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ హరీష్ టాండన్, జస్టిస్ దీక్షిత్ కృష్ణశ్రీపాద్, తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ మధుసూదన్‌రావు ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో ఆలయంలోకి వెళ్లారు. ముందుగా ధ్వజస్తంభానికి మొక్కుకుని తర్వాత గర్భాలయంలోని మూలమూర్తిని దర్శించుకున్నారు.రంగనాయక మండపంలో వేద పండితులు ఆశీర్వచనం చేయగా అధికారులు లడ్డూప్రసాదాలు అందజేశారు.

తిరుమలేశుని దర్శించుకున్న ప్రముఖులు


అచ్చెన్నాయుడు - సుమన్

తిరుమల, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని ఆదివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు, తెలంగాణ మంత్రులు పర్ణిక రెడ్డి, కొత్త ప్రభాకర్, సినీనటుడు సుమన్ ఉన్నారు. వీరికి ఆలయాధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి, లడ్డూప్రసాదాలు అందజేశారు.

షష్టిపూర్తి సినిమాకు మంచిపేరు వచ్చింది

నటుడు రాజేంద్రప్రసాద్


రాజేంద్రప్రసాద్, రూపేష్, పవన్ ప్రభ

తిరుమల, జూన్15(ఆంధ్రజ్యోతి): ఇటీవల విడుదలైన షష్టిపూర్తి సినిమాకు మంచి పేరు వచ్చిందని, చూసిన ప్రతి ఒక్కరూ గౌరవమర్యాదలను కాపాడుతూ సినిమా తీశారని మెచ్చుకుంటున్నారని నటుడు రాజేంద్రప్రసాద్ అన్నారు. ఆ చిత్ర నటుడు, నిర్మాత రూపేష్, దర్శకుడు పవన్ ప్రభ, చిత్ర బృందంతో కలిసి ఆదివారం ఆయన తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ స్వామికి కృతజ్ఞతలు తెలిపేందుకు తిరుమలకు వచ్చామన్నారు. పెళ్లిపుస్తకం సినిమా నుంచి షష్టిపూర్తి వరకు అభిమానుల ముందే పెరుగుతున్నానని, చివరి శ్వాస వరకు ప్రజలతోనే ఉంటానని అన్నారు. రూపేష్, పవన్‌ప్రభ మాట్లాడుతూ షష్టిపూర్తి సినిమాను అందరూ మెచ్చుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

చినుకు పడితే చెరువుల్లా రోడ్లు



ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయ రోడ్డులో వర్షపునీరు

సూళ్లూరుపేట, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట మున్సిపాలిటీలో సిమెంటు రోడ్లపై చినుకు పడితే చాలు వర్షపునీరు నిలబడిపోతుంది. ఆ రోడ్లపై ద్విచక్ర వాహనదారులు, పాదచారులు వెళ్లాలంటే సాహసం చేయాల్సి వస్తోంది. జీఎన్ రోడ్డు నుంచి రైల్వేస్టేషన్‌కు వెళ్లే దారిలో చిన్నపాటి వర్షమొచ్చిన నీరుబడిపోతోంది. పక్కనే మురుగుకాలువ ఉన్నా సిమెంటు రోడ్డు తక్కువ ఎత్తులో ఉండడంతో వర్షమొచ్చినప్పుడు నీళ్లు పారకుండా అలాగే ఉండి పోతున్నాయి. అదే విధంగా ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం వద్ద వేసిన సిమెంటు రోడ్డులో కూడా ఇదే పరిస్థితి. మన్నారుపోలూరు సచివాలయానికి వెళ్లే రోడ్డు చిన్నపాటి వర్షమొచ్చినా అధ్వానంగా మారుతోంది. మున్సిపాలిటీ అధికారులు స్పందించి సిమెంటు రోడ్లపై వర్షపునీరు నిలబడకుండా చూడాల్సిన అవసరం ఉంది.

పేదరిక నిర్మూలనే చంద్రబాబు లక్ష్యం: కురుగొండ్ల



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

వెంకటగిరి, జూన్ 15:(ఆంధ్రజ్యోతి) పేదరిక నిర్మూలనే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పనిచేస్తున్నట్లు ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. ఆదివారం పట్టణంలోని పింజలి వీరయ్య కల్యాణ మండపంలో జరిగిన గాండ్ల, తెలికుల ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో 2024-2025 విద్యా సంవత్సరంలో 10వ తరగతిలో ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు ఉపకార వేతనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదరికం లేని రాష్ట్రంగా తీర్చి దిద్దాలన్న సంకల్పంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అనేక సంక్షేమ పథకాలను ప్రవేశ పెడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కుల సంఘ రాష్ట్ర అధ్యక్షులు వాకాటి హరికృష్ణ, రామిశెట్టి నారాయణ, సభ్యులు బికే ప్రసాద్, నవీన్ చంద్రశేకర్, ఝాన్సీ రాణి, నాగరాజు తదితరులు ఉన్నారు.

తల్లికి వందనంతో తల్లుల్లో ఆనందం



సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న టీడీపీ నాయకులు

పెళ్లకూరు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు తల్లికి వందనం పథకం అమలు చేయడంతో విద్యార్థుల తల్లుల్లో ఆనందం వెల్లివిరుస్తోందని టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య అన్నారు. ఆదివారం మండలంలోని పునబాక గ్రామంలో సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్ చిత్రపటాలకు లబ్ధిదారులు, టీడీపీ నాయకులు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ ఒకటో తరగతి నుంచి ఇంటర్ వరకు చదువుతున్న విద్యార్థులు ఒక కుటుంబంలో ఎందరున్నా తల్లికి వందనం పథకం ద్వారా నగదు అందించడంతో చదువులకు ఎలాంటి ఆటకం లేకుండా కొనసాగుతాయన్నారు. కార్యక్రమంలో స్వర్ణముఖినది ఆనకట్ట ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ దామెర ప్రసాద్‌నాయుడు, నాయకులు వేలూరు హరినాయుడు, తాళ్ల యుగంధర్‌గౌడ్, పునబాక పోలయ్య, జనసేన నాయకుడు తాళ్లరెడ్డి శ్రీనివాస్, మాడుపూరు మురళీనాయుడు, సుమన్‌రెడ్డి, కన్నలి విజయ భాస్కర్, కుమార్‌గాంధి, పరుశురామ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై శిక్షణ



ఫ్యాకల్టీ అభివృద్ధి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ రవిప్రసాద్

గూడూరు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక నారాయణ ఇంజనీరింగ్ కళాశాలలో ఆదివారం అటల్ ఫ్యాకల్టీ అభివృద్ధి కార్యక్రమం జరిగింది. ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగంలోని ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై అధ్యాపకులకు శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ రవిప్రసాద్ మాట్లాడుతూ అధ్యాపకుల్లో నైపుణ్యాలను పెంపొందించేందుకు అటల్ ఫ్యాకల్టీ అభివృద్ధి కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. సాంకేతిక రంగంలో వస్తున్న మార్పులను అధ్యాపకులకు వివరించడం జరుగుతుందని, దీంతో అధ్యాపకులు విద్యార్థులకు సులభతరంగా అర్థమయ్యేలా బోధన అందించేందుకు వీలుంటుందన్నారు. కార్యక్రమంలో దత్తాత్రేయ శర్మ, విశ్వక్సేనారెడ్డి, కొండారెడ్డి, వాసుదేవరెడ్డి, హరికిషోర్ తదితరులు పాల్గొన్నారు.

తూపిలిపాళెం తీరంలో పర్యాటకుల సందడి



వాకాడు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తూపిలిపాళెం సముద్ర తీరంలో ఆదివారం పర్యాటకుల సందడి నెలకొంది. ఆదివారం సెలవు కావడంతో పిల్లలు, యువతతో పాటు పెద్దలు సముద్రతీరానికి వచ్చి సరదాగా గడిపారు. వందల సంఖ్యలో పర్యాటకులు రావడంతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

ముత్యాలమ్మకు పూజలు

చిల్లకూరు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తూర్పు కనుపూరు గ్రామంలో వెలసిన ముత్యాలమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు ఆలయం వద్ద పొంగళ్లు పెట్టుకుని నైవేద్యం నివేదించారు. ఆలయం ఎదుట ఉన్న త్రిశూలం వద్ద టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.

ఆటో డ్రైవర్ ఆత్మహత్య

కోట, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కేశవరం పంచాయతీ కొండుగుంటలో నివాసం ఉంటున్న మద్దినేని నాగరాజు (40) ఉరివేసుకొని మృతి చెందినట్లు ఎస్‌ఐ పవన్‌కుమార్ ఆదివారం తెలిపారు. కావలికి చెందిన నాగరాజు కొండుగుంటలోని అత్తగారి ఇంట్లో ఉంటూ ఆటో నడుపుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఆదివారం భార్యతో గొడవపడిన నాగరాజు ఇంట్లో ఇనుప రాడ్‌కు తాడుతో ఉరివేసుకొని అపస్మారకస్థితికి చేరుకున్నాడు. కుటుంబ సభ్యులు గమనించి చికిత్స నిమిత్తం నెల్లూరు ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

డివైడర్‌ను ఢీకొన్న లారీ

నాయుడుపేట టౌన్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట - చెన్నై రహదారి సమీపంలో లారీ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొంది. ఆదివారం తెల్లవారుజామున జరిగిన ఈ ప్రమాదంలో డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి.

ప్రభుత్వ పాఠశాలలకు ప్రహరీ నిర్మించండి



ప్రహరీ లేని శంకరన్ గిరిజనకాలనీ, దళితవాడలోని ప్రాథమిక పాఠశాలలు

చిల్లకూరు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలలకు ప్రహరీ లేక విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. స్థానిక శంకరన్ గిరిజనకాలనీ, దళితడవాడ, ఉడతావారి పార్లపల్లి, చేడిమాల తదితర గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలలకు ప్రహరీలు లేవు. దీంతో పాఠశాలల్లోకి పశువులు, కుక్కలు ప్రవేశించడంతో అపరిశుభ్ర వాతావరణం నెలకొంటోంది. శంకరన్ గిరిజకాలనీ, దళితవాడలోని పాఠశాలల సమీపంలో చుట్టూ ముళ్లచెట్లు పెరిగిపోయాయి. దీంతో పాఠశాలల్లోనికి విషసర్పాలు ప్రవేశిస్తున్నాయని విద్యార్థులు, ఉపాధ్యాయులు భయాందోళన చెందుతున్నారు. అంతేకాకుండా ప్రహరీలు లేకపోవడంతో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. అధికారులు స్పందించి పాఠశాలలకు ప్రహరీ నిర్మాణాలు చేపట్టాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

హామీలన్నీ చిత్తశుద్ధితో అమలు: పాశం



మల్లాంలో సిమెంట్ రోడ్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్, టీడీపీ మండల అధ్యక్షుడు గణపర్తి కిషోర్ నాయుడు

చిట్టమూరు, జూన్ 15(ఆంధ్రజ్యోతి): ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలన్నీ చిత్తశుద్ధితో అమలు చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చర్యలు తీసుకుంటున్నారని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. ఆదివారం మండలంలోని పలు గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలను ఆయన పాల్గొని ప్రారంభించారు. మల్లాంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తూ సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తున్నామని తెలిపారు. ఓర్వలేని వైసీపీ నాయకులకు మంత్రి నారా లోకేశ్‌పై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తల్లికి వందనం పథకంలో ప్రతి బిడ్డకూ నగదు వేసిన ఘనత బాబుకే దక్కిందన్నారు. కాగా, తాడిమేడు గ్రామంలో రూ.10 లక్షలు, కోగిలిలో రూ.10 లక్షలతో నిర్మించిన సిమెంట్ రోడ్లను ఆయన ప్రారంభించారు. మల్లాంలో రూ.21.80 లక్షలతో నిర్మించిన రైతు సేవా కేంద్రం, రూ.43.60 లక్షలతో నిర్మించిన సచివాలయం భవనం, రూ.20 లక్షలతో నిర్మించిన సిమెంట్ రోడ్డును ఎమ్మెల్యే ప్రారంభించారు. యల్లసిరిలో రూ.15 లక్షలతో వేసిన మెటల్ రోడ్డు, యాకసిరి గ్రామంలో ఆర్‌డీఎస్ నిధులు రూ.2.50 కోట్లతో ఎస్డీసీఎల్ పనులు, రూ.5 లక్షలతో నిర్మించిన సిమెంట్ రోడ్డును ఎమ్మెల్యే ప్రారంభించారు. తాడిమేడు గ్రామంలో సిమెంట్ రోడ్లకు అదనంగా మరో రూ.15 లక్షలు మంజూరు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. మాజీ ఎంపీపీ ఉక్కు జనార్దన్ కోరిక మేరకు కొత్తగుంట నుంచి ఆరూరు వరకు వచ్చే డొంక అభివృద్ధికి కృషి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీవో మనోహర్ గౌడ్, తహసీల్దారు సతీష్ కుమార్, సీఐ హుస్సేన్ బాషా, టీడీపీ మండల అధ్యక్షుడు గణపర్తి కిషోర్ నాయుడు, నాయకులు కామిరెడ్డి సునీల్‌రెడ్డి, దువ్వూరు భారతమ్మ, మునిశేఖర్ రెడ్డి, మస్తాన్‌రెడ్డి, జనార్దనరెడ్డి, ధనంజయ్య నాయుడు, హరికృష్ణారెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు శరత్‌రెడ్డి, రాజేష్‌రెడ్డి, సుందరయ్య, వెంకటరమణయ్య, చెంచురామయ్య ఆచారి, చిన్నారావు, బషీర్, మణి తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ అసత్య ప్రచారాలు మానుకోవాలి: విజయశ్రీ

సూళ్లూరుపేట, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): వైసీపీ అసత్య ప్రచారాలు మానుకోవాలని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. ఆదివారం సూళ్లూరుపేటలోని క్యాంప్ కార్యాలయంలో ఆమె టీడీపీ నాయకులతో కలిసి మీడియాతో మాట్లాడారు. సీఎం చంద్రబాబు సూపర్ సిక్స్ హామీలో భాగంగా తల్లికి వందనం పథకం కింద తల్లుల ఖాతాల్లో నగదు జమ చేశారని చెప్పారు. ఒక ఇంట్లో ఎంత మంది అర్హులున్నా అందరికీ తల్లికి వందనం వర్తింపజేశారన్నారు. ఇచ్చిన మాట ప్రకారం అర్హులందరికీ నగదు జమ చేయడంతో రాష్ట్రమంతా పండగ వాతావరణం నెలకొని ఉంటే వైసీపీ అసత్య ప్రచారాలు చేస్తోందన్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తల్లి వందనం పథకంలో అవినీతి జరిగిందని ఆరోపించడం సిగ్గుచేటన్నారు. ఎన్నికల హామీలను ఒక్కొక్కటిగా నెరవేర్చుతుంటే ఏమి చేయలేదని చెప్పడం తగదన్నారు. వైసీపీ విమర్శలు మాని అభివృద్ధికి సహకరించాలని హితువు పలికారు. అనంతరం తల్లికి వందనం లబ్ధిపొందిన తల్లులు, పిల్లలతో కలిసి కేక్ కట్‌చేశారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఆకుతోట రమేష్, తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాధవ నాయుడు, నాయకులు చిట్టేటి పెరుమాల్, కొక్కు శంకరయ్య, పాకం వెంకట సుబ్బయ్య, కరకంబేటి సుబ్రహ్మణ్యం, సంచి కృష్ణయ్య, విజయ నాయుడు, రాజసులోచనమ్మ తదితరులు పాల్గొన్నారు.



తల్లులు, విద్యార్థులతో కలిసి కేక్‌కట్ చేస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ, పక్కన టీడీపీ నాయకులు ఆకుతోట, మాధవ నాయుడు

గడ్డిమందు తాగి యువకుడి మృతి



మృతి చెందిన బాలసుబ్రహ్మణ్యం

దొరవారిసత్రం, జూన్ 15(ఆంధ్రజ్యోతి): దొరవారిసత్రం మండలం వేణుంబాక దళితవాడకు చెందిన బాలసుబ్రహ్మణ్యం(23) గడ్డిమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న బాలసుబ్రహ్మణ్యం ఈ నెల 11న గడ్డి మందు తాగి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. కుటుంబ సభ్యులు చెన్నైలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు.

అట్రాసిటీ కేసు విచారణ

చిట్టమూరు, జూన్ 15(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పెద్ద దరఖాస్తు గ్రామంలో అట్రాసిటీ కేసును డీఎస్పీ గీతా కుమారి విచారించారు. ఈనెల 9న కోటపూరి తిరుపాలయ్యను అదే గ్రామానికి చెందిన మల్లీశ్వరమ్మ కౌలు లీజు విషయంలో కులం పేరుతో దూషించినట్లు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో సాక్షులను ఆదివారం డీఎస్పీ విచారించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ చిన్న బలరామయ్య, వీఆర్వో కోటయ్య పాల్గొన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం

నాయుడుపేట టౌన్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట - శ్రీకాళహస్తి బైపాస్‌రోడ్డు సమీపంలో అక్రమంగా నిల్వచేసి ఉన్న 50 బస్తాల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఇందుకు సంబంధించి సురేష్, పవన్, దయాకర్‌పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

కోట, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): కోట మండలం తిన్నెలపూడిలోని గమళ్లపాళెం పొలాల వద్ద ఆదివారం తెల్లవారుజామున 25 ఏళ్ల యువకుడు విద్యుదాఘాతానికి గురై మృతి చెంది ఉండటంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్‌ఐ పవన్‌కుమార్ వెళ్లి పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేపట్టారు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ పవన్‌కుమార్

గంగమ్మకు ప్రత్యేక పూజలు



గంగమ్మ పూజా కార్యక్రమంలో ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, తానంకి నానాజీ తదితరులు

చిల్లకూరు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన చిల్లకూరు గొల్లపాళెంలోని గంగమ్మ ఆలయంలో నిర్వహిస్తున్న కొలుపులో భాగంగా ఆదివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయంలో మహిళలు సామూహికంగా అంబలి తీసుకువచ్చి అమ్మవారికి జరిపారు. ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, టీడీపీ సీనియర్ నాయకులు తానంకి నానాజీ అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో చిల్లకూరు పట్టాభిరామిరెడ్డి, కొండా రామచంద్రారెడ్డి, దాసరి రాము తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

వెంకటగిరి, జూన్ 15:(ఆంధ్రజ్యోతి) పట్టణంలోని తేలిమిట్టకు చెందిన లక్ష్మమ్మ క్యాన్సర్‌తో బాధపడుతోంది. శ్రీకృష్ణదేవరాయ కాపు, బలిజ, తెలగ ట్రస్టు నిర్వాహకులు లక్ష్మమ్మ వైద్యఖర్చుల నిమిత్తం రూ.5వేల అందజేశారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు తోట కృష్ణయ్య, బీరం రాజేశ్వరరావు, గొల్లగుంట రాము, చింతకాయల మహేష్, కందాల తిరుపాల్, పసుపులేటి విజయకుమార్, వెంకటరమణ, అపర్ణ, శిరిషా తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారికి లక్ష తులసీపూజ



వెంకటేశ్వరస్వామికి లక్షతులసీపూజ నిర్వహిస్తున్న భక్తులు

గూడూరు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక రాజావీధిలోని ప్రసన్న వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. ఉదయం స్వామి, అమ్మవార్లకు వైభవంగా లక్ష తులసీపూజ, పుష్పయాగోత్సవం నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో అన్నప్రసాదాల వితరణ జరిగింది. రాత్రి ద్వాదశారాధనం జరిపారు. ఈ పూజా కార్యక్రమాల్లో ఉత్సవ కమిటీ చైర్మన్, శ్రీకంటి రామమోహన్‌రావు, ఈవో రవికృష్ణ, ఉభయదాత తలమంచి సిద్దారెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

అన్ని పాఠశాలలకు పుస్తకాల సరఫరా

ఓజిలి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని పాఠశాలలకు పుస్తకాలను సరఫరా చేసినట్లు ఎంఈవో చంద్రశేఖర్ తెలిపారు. విద్యాసంవత్సరం ప్రారంభం నుంచే విద్యార్థులకు అందజేయాలనే ధ్యేయంతో పాఠశాలలకు సరఫరా చేశామని, ప్రధానోపాధ్యాయుల ద్వారా విద్యార్థులకు వాటి అందించేలా చర్యలు తీసుకున్నట్లు ఆయన తెలిపారు. అలాగే స్థానిక నాయకుల సహకారంతో కూడా పుస్తకాలు, కిట్లను అదజేసినట్లు ఎంఈవో తెలిపారు.

వృద్ధుల పట్ల గౌరవంగా నడుచుకోవాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న జడ్జి వెంకటనాగ పవన్

గూడూరు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): సమాజంలో ప్రతి ఒక్కరూ వృద్ధుల పట్ల గౌరవంగా మెలగాలని ఏడవ అదనపు జిల్లా జడ్జి వెంకటనాగ పవన్ అన్నారు. ఆదివారం మండలంలోని పోటుపాళెం గ్రామంలో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ వృద్ధుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృద్ధుల పట్ల అమర్యాదగా ప్రవర్తించడం, వారికి కల్పించిన చట్టాలను దుర్వినియోగం చేయడం, వేధింపులకు గురిచేయడం చట్టరీత్యా నేరమన్నారు. వృద్ధుల పట్ల మర్యాదపూర్వకంగా నడుకుంటూ వారిని నిర్లక్ష్యం చేయకుండా తగిన సాయం అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో న్యాయమూర్తి రాజేష్, ఎస్‌ఐ మనోజ్‌కుమార్, గ్రామస్తులు పాల్గొన్నారు.

వృద్ధుల పట్ల బాధ్యతగా వ్యవహరించాలి

తడ, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): వృద్ధులపట్ల ప్రతి ఒకరూ బాధ్యతగా వ్యవహరించాలని సూళ్లూరుపేట ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి సంయుక్త అన్నారు. ఆదివారం మండల పరిధిలోని కారిజాత గ్రామంలో లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. న్యాయమూర్తి సంయుక్త మాట్లాడుతూ చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. న్యాయవాదులు తిరుమూరు సుధాకర్‌రెడ్డి, ధర్మ ప్రసాద్, చలపతి, రెవెన్యూ, పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి కబడ్డీపోటీలకు విద్యార్థినుల ఎంపిక



విద్యార్థినులను అభినందిస్తున్న హెచ్‌ఎం మాధవీలక్ష్మి, పీడీ విజయలక్ష్మి

గూడూరు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు స్థానిక జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థినులు ఎంపికయ్యారని హెచ్‌ఎం మాధవీలక్ష్మి తెలిపారు. ఈనెల 12వ తేదీన అమ్మెచ్యూర్ కబడ్డీ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కాకినాడలో నిర్వహించిన జాతీయస్థాయి కబడ్డీ జట్టు ఎంపిక పోటీల్లో తమ పాఠశాలకు చెందిన విద్యార్థినులు దీపిక, కౌసల్య ప్రతిభచారని చెప్పారు. వీరు జూలై 10నుంచి 13వ తేదీ వరకు రాజస్థాన్‌లో జరగనున్న జాతీయస్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొంటారన్నారు. ఆదివారం పాఠశాలలో విద్యార్థినులను హెచ్‌ఎం మాధవీలక్ష్మి అభినందించారు. కార్యక్రమంలో పీడీ విజయలక్ష్మి, మ్యాజిక్ బస్ ఫౌండేషన్ ప్రతినిధి లత తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి పుట్‌బాల్ టోర్నీ విజేత తిరుపతి

నాయుడుపేట, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట ఏఎల్‌సీఎం క్రీడా ప్రాంగణంలో జిల్లాస్థాయి పుట్‌బాల్ టోర్నమెంట్ నిర్వహించారు. అండర్-17 విభాగంలో తిరుపతి టీమ్ విన్నర్‌గా, రేణిగుంట టీమ్ రన్నర్‌గా నిలిచాయి. ఆదివారం రాత్రి సీఐ బాబి, కోచ్ షేక్ గౌస్‌బాషా, పుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి రెడ్డెప్ప ట్రోఫీ అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఏఎల్‌సీ చర్చి సభ్యులు కళాచంద్, భావన్, సుమన్, భాను, మధు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు కూరగాయలు, కోడిగుడ్లు పంపిణీ

గూడూరు అర్బన్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక విశ్రాంత ఉద్యోగుల భవనంలో ఆదివారం జనవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో దశరధరామిరెడ్డి దాతృత్వంతో దివ్యాంగులకు కూరగాయలు, కోడిగుడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జేవీవీ పట్టణాధ్యక్షుడు వేగూరు రాజేంద్రప్రసాద్, నాగరాజు, పురుషోత్తమరావు, సుబ్బారావు, ప్రభాకర్, ఇబ్రహీం, అశోక్, రాధయ్య, రజనీకాంత్, సుధీర్, శ్రీనివాసాచారి, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి నారాయణకు టీడీపీ నేతల శుభాకాంక్షలు



మంత్రి నారాయణకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్న జిల్లా తెలుగుయువత ఉపాధ్యక్షుడు పరసా రాజా

నాయుడుపేట, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ శాఖామంత్రి పొంగూరు నారాయణకు నాయుడుపేట టీడీపీ నాయకులు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆదివారం నెల్లూరులో మంత్రి నారాయణను కలిసిన తెలుగుయువత జిల్లా ఉపాధ్యక్షుడు పరసా రాజా, నెల్లూరు జిల్లా తెలుగు మహిళా అధ్యక్షురాలు పనబాక భూలక్ష్మి, టీడీపీ లీగల్ సెల్ న్యాయవాది పనబాక గంగబాబు తదితరులు శాలువాలు, పుష్పగుచ్ఛాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

టీడీపీ నేత కుటుంబానికి పరామర్శ

చిట్టమూరు, జూన్ 15(ఆంధ్రజ్యోతి): టీడీపీ నేత, చిట్టమూరు జీఎం నాయుడు ఉన్నత పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ బద్దిగ నారాయణ ఇటీవల మృతి చెందారు. ఆయన కుటుంబ సభ్యులను ఆదివారం గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ పరామర్శించారు. ప్రముఖ పారిశ్రామికవేత్త కొండేపాటి గంగాప్రసాద్ సూచన మేరకు రూ.లక్ష నారాయణ కుటుంబ సభ్యులకు అందజేస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఆయన వెంట టీడీపీ మండల అధ్యక్షుడు గణపర్తి కిషోర్ నాయుడుకు, మాజీ జెట్పీటీసీ భారతమ్మ, జనార్దనరెడ్డి, రాజేష్‌రెడ్డి, చెంచురామయ్య ఆచారి ఉన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేపట్టండి



బుచ్చినాయుడుకండ్రిగ, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నీర్పాకోటలో సూళ్లూరుపేట రోడ్డుకు సమీపంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ ఇటీవల కురిసిన వర్షాలకు కూలిపోయింది. దానికి మరమ్మతులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ కూలిపోవడంతో పంటలకు నీరు అందడం లేదని రైతులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేపట్టాల్సి ఉంది.

పొంచి ఉన్న ప్రమాదం

సిమెంటు రోడ్డు కింద తొర్ర ● వాహనాల రాకపోకలతో కంపిస్తున్న రోడ్డు



వరదయ్యపాళెం, జూన్ 15(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంకు ఎదురుగా ఉన్న సిమెంటు రోడ్డు వాహనదారులను ప్రమాదంలోకి నెట్టే పరిస్థితిలో ఉంది. పైకి చూస్తే బాగా ఉన్నా కింద మట్టి కరిగి తొర్రగా మారింది. వాహనాలు, ముఖ్యంగా భారీ వాహనాలు వెళ్లే సమయంలో రోడ్డంతా కంపిస్తుండటంతో వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. ఈ రోడ్డు ఎప్పుడు కుంగుతుందోనని ఆందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాల్సి ఉంది.

తప్పిపోయిన వ్యక్తి బంధువులకు అప్పగింత



శ్రీకాళహస్తి, జూన్ 15(ఆంధ్రజ్యోతి): తప్పిపోయిన వ్యక్తిని శ్రీకాళహస్తీశ్వరాలయంలో విధులు నిర్వహించే హోంగార్డులు వారి కుటుంబసభ్యులకు అప్పగించారు. తెలంగాణ రాష్ట్రం సంగారెడ్డి జిల్లా సదాశివపేట మండలం కోనాపూర్‌కి చెందిన సత్తయ్య కుటుంబ సభ్యులతో తిరుమల శ్రీవారి దర్శనానికి వచ్చాడు. అయితే అతను తప్పిపోయాడు. నిరక్షరాస్యుడు కావడంతో ఎక్కడి వెళ్లాలో తెలియక చేతిలో డబ్బులు లేక నడుచుకుంటూ ఆదివారం శ్రీకాళహస్తికి వచ్చాడు. శ్రీకాళహస్తీశ్వరాలయం సమీపంలో అతను ఎటు వెళ్లాలో తెలియక విలపిస్తుండడంతో గుర్తించిన ఆలయ హోంగార్డు రాజేష్ అక్కడికి చేరుకుని వివరాలు ఆరా తీశాడు. అతను తెలిపిన వివరాల మేరకు గూగుల్‌లో శోధించి సంగారెడ్డి జిల్లా హెడ్ క్వార్టర్స్ కంట్రోల్ రూంకు కాల్ చేశారు. పోలీసులు సదాశివపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో పోలీసులు వివరాలు సేకరించి రాజేష్‌కు సత్తయ్య కూతురు, అల్లుడి ఫోన్ నెంబర్లు ఇచ్చారు. రాజేష్ వారికి ఫోన్ చేశాడు. సత్తయ్య కోసం వెదుకుతున్న వారు శ్రీకాళహస్తికి చేరుకున్నారు. దీంతో అతన్ని వారికి అప్పగించారు.

మంత్రి నారాయణకు జన్మదిన శుభాకాంక్షలు



శ్రీకాళహస్తి, జూన్ 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ జన్మదిన వేడుకలు విజయవాడలో జరిగాయి. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి జనసేన నాయకుడు పసుపులేటి నవీన్‌కుమార్ పాల్గొని మంత్రికి శుభాకాంక్షలు తెలిపి ముక్కంటి తీర్థప్రసాదాలను అందజేసి కలంకారీ శాలువా కప్పి సత్కరించారు.

వైసీపీ విద్యార్థి విభాగ నాయకుడి జన్మదిన వేడుకలు

శ్రీకాళహస్తి, జూన్ 15(ఆంధ్రజ్యోతి): పట్టణంలో వైసీపీ విద్యార్థి విభాగానికి చెందిన సుబ్రహ్మణ్యం జన్మదిన వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. శ్రీకాళహస్తి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, వైసీపీ రాష్ట్ర రైతు విభాగ ప్రధాన కార్యదర్శి కృష్ణారెడ్డి హాజరై జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అంకయ్య, వెంకటేష్‌నాయుడు, పసల కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

పుత్తూరు వార్తలు

వైభవంగా ధ్వజావరోహణం



స్వామిఅమ్మవార్లకు స్నపన తిరుమంజనం



వడమాలపేట, జూన్ 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని అప్పలాయగుంట ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో చివరి రోజైన ఆదివారం చక్రస్నానం శాస్త్రోక్తంగా నిర్వహించారు. అంతకుముందు సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి నిత్య కైంకర్యాలు నిర్వహించారు. ఉదయం 9.15 నుంచి 10.30 గంటల మధ్య శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరుడికి, చక్రత్తాళ్వార్‌కు పుష్కరిణి ఎదురుగా వేడుకగా స్నపన తిరుమంజనం చేపట్టారు. పాలు, పెరుగు, తేనె, పసుపు, చందనం, నారికేళ జలంలో అభిషేకం చేశారు. అనంతరం పుష్కరిణి వద్ద చక్రత్తాళ్వారుకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కంకణభట్టార్ తిప్పయ్యాచార్యులు ఆధ్వర్యంలో అర్చకులు చక్రత్తాళ్వారుకు భక్తుల గోవింద నామస్మరణలతో పుష్కరిణిలో చక్రస్నానం నిర్వహించారు. అర్చకులు, అధికారులు, భక్తులు పెద్ద ఎత్తున స్నానాలు ఆచరించారు. సాయంత్రం 6.00-7.00 గంటల మధ్య నవసంధి, మాడవీధి ఉత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈవో హరీంద్రనాథ్, ఏఈవో దేవరాజులు, సూపరింటెండెంట్ శ్రీవాణి, ఆలయ అధికారి శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా ధ్వజావరోహణం

ప్రసన్న వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలను ధ్వజావరోహణం నిర్వహించి పరిసమాప్తి చేశారు. ఆదివారం రాత్రిరాత్రి 7 - 7.30 గంటల మధ్య గరుడ పటాన్ని అవనతం చేశారు. ధ్వజారోహణం రోజున ఆహ్వానించిన సకల దేవతా పరివారాన్ని సాగనంపేలా అర్చక స్వాములు వేదమంత్రాలు పటిస్తూ ధ్వజ పటాన్ని కిందకు దింపి ప్రత్యేక పూజలు చేశారు.

వృద్ధులకు రక్షణగా చట్టాలు

పుత్తూరు అర్బన్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): వృద్ధులు నిర్లక్ష్యానికి నిరాదరణకు గురవుతున్నారని అడ్వకెట్ దినకర్ చెప్పారు. ఆదివారం ప్రపంచ వృద్ధుల వేధింపుల నివారణ దినం సందర్భంగా పుత్తూరు సీనియర్ సివిల్ జడ్జి ఎస్‌సీ రాఘవేంద్ర ఆదేశాల మేరకు మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో రాస్ వృద్ధాశ్రమంలో చట్టాలపై అవగాహన కల్పించారు. కుటుంబ సంక్షేమం, అభివృద్ధి కోసం తమ జీవితాన్ని త్యాగం చేసిన వారికి జీవిత చరమాంకంలో సముచిత స్థానం లభించడం లేదన్నారు. వృద్ధులపై జరుగుతున్న హింస, దాడులు బాధాకరమన్నారు. పిల్లల నుంచి నిరాదరణకు గురైన వృద్ధులకు మనోవర్తి పొందేందుకు మండల న్యాయ సేవాధికార సంస్థ ఉచిత న్యాయ సహాయాన్ని అందిస్తుందన్నారు. కలెక్టరేట్‌లో వృద్ధుల రక్షణకు ప్రత్యేక విభాగం ఉందన్నారు. అందులో ఫిర్యాదు చేయవచ్చన్నారు. అంతకుముందు వారికి పండ్లు పంపిణీ చేశారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



పుత్తూరు అర్బన్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): ఎన్నికల ప్రచారంలో సూపర్ సిక్స్ హామీలో భాగంగా తల్లికి వందనం పథకం అమలు చేసిన సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్‌కు లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు. ఆదివారం 19వ వార్డులో తల్లికివందనం నగదు పొందిన తల్లిదండ్రులు, విద్యార్థులు సీఎం చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కుటుంబంలో ఎంతమంది పిల్లలుంటే అంత మందికి తలా రూ.13 వేలు చొప్పున జమ చేయడం గొప్ప విషయమన్నారు. 19వ వార్డు టీడీపీ ఇన్‌చార్జి కృష్ణకుమార్, నగరి నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి మహేష్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు గాలి జీవరత్నం నాయుడు, ఉషారాణి, మోహన్‌కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వారాహి అమ్మవారి ఆలయంలో పంచమి పూజలు

పుత్తూరు టౌన్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని పరమేశ్వరమంగళం సమీపంలో ఉన్న దక్షిణ కాళిఅమ్మన్ వారాహి శక్తి పీఠంలో పంచమి సందర్భంగా ఆలయ చైర్మన్ మోహనమ్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి ఉదయం నిత్య పూజా కైంకర్యాలు, ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. శాంతి హోమాలు నిర్వహించారు. అన్నదానం చేశారు.

శ్రీకాళహస్తి సత్యవేడు

విద్యా సామగ్రి పంపిణీ

ఏర్పేడు, జూన్ 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిందేపల్లి గిరిజన కాలనీకి చెందిన విద్యార్థులకు యువనేస్తం ఆధ్వర్యంలో విద్యాసామగ్రిని అందించారు. యువనేస్తం వ్యవస్థాపక అధ్యక్షులు మునిశేఖర్ చేతుల మీదుగా పిల్లలకు ఈ సామగ్రిని పంపిణీ చేశారు. వినోద్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భక్తజన సంద్రం ముక్కంటి ఆలయం



శ్రీకాళహస్తి, జూన్ 15(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయం ఆదివారం భక్త జన సంద్రంగా మారింది. వారాంతపు, వరుస సెలవులు కావడంతో రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. సుమారు 28వేలమంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. రూ.500 అంతరాలయ దర్శనం 703, రూ.200 శీఘ్రదర్శనం టిక్కెట్ల ద్వారా 3,180మంది, రూ.50ప్రత్యేక దర్శనం టిక్కెట్ల ద్వారా 5,008మంది భక్తులు దర్శించుకున్నారు. ఇక రూ.500 రాహుకేతు టిక్కెట్ల ద్వారా 3,352మంది, రూ.750 టిక్కెట్ల ద్వారా 1,486, రూ.1,500 టిక్కెట్ల ద్వారా 493, రూ.2,500 టిక్కెట్ల ద్వారా 280, రూ.5వేలు టిక్కెట్ల ద్వారా 90మంది భక్తులు పూజలు చేయించుకున్నారు. ఇక ఐదు రకాల ప్రసాదాలు కలిపి 24,230 అమ్ముడైనట్లు ఆలయ అధికారులు తెలిపారు.

వైద్య శిబిరానికి స్పందన

ఏర్పేడు, జూన్ 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎండీపుత్తూరులో నారాయణాద్రి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన వైద్య శిబిరానికి స్పందన లభించింది. సుమారు వందమంది వైద్యపరీక్షలు చేయించుకున్నారు. 60మందికి ఈసీజీ తీసి వైద్య సలహాలు అందించి మందులను పంపిణీ చేశారు. నారాయణాద్రి ఆస్పత్రి వైద్యులు కీర్తన, దీన కుమార్, ప్రియ పాల్గొన్నారు. వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయించిన సర్పంచ్ మోహన ప్రియను గ్రామస్తులు అభినందించారు.

పీహెచ్‌సీలో ఆటాపాటలపై విచారణ

తిరుపతి(వైద్యం), జూన్ 15(ఆంధ్రజ్యోతి): రోగులకు వైద్యసేవలు అందించే ఆస్పత్రిలో బయటి వ్యక్తులతో కలిసి సిబ్బంది డ్యాన్సులు వేసిన విషయంపై విచారణ చేపట్టి అందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్‌వో బాలకృష్ణనాయక్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నాగలాపురం ప్రాథమిక వైద్యశాలలో కొందరు సిబ్బంది బయటి వ్యక్తులతో కలిసి డ్యాన్సులు వేయడంపై ఆదివారం ఆంధ్రజ్యోతిలో 'నాగలాపురం పీహెచ్‌సీలో ఆటాపాట' శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించిన ఆయన ఈ విషయంపై విచారణ చేపట్టారు.

ఘనంగా ఫాదర్స్ డే



బుచ్చినాయుడుకండ్రిగ, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఫాదర్స్ డేను ఘనంగా జరుపుకున్నారు. నీర్పాకోటలోని ఈసీఐ చర్చిలో ఫాదర్స్ డే సందర్భంగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా పాస్టర్ జాన్‌వెస్లీ కుటుంబంలో తండ్రి పాత్ర ఎలా ఉంటుందో వివరించారు.

మాతమ్మ సేవలో బృందమ్మ



ఏర్పేడు, జూన్ 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెన్నంపల్లిలో జరిగిన మాతమ్మ కొలుపు మహోత్సవంలో మాజీ మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి సతీమణి బృందమ్మ పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఆమెకు ఘన స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనానంతరం తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాగరాజునాయుడు, మనోహర్ నాయుడు, కృష్ణవేణి, రోశయ్య, హరిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆగి ఉన్న కారును ఢీకొన్న బైక్ ఒకరికి తీవ్రగాయాలు



క్షతగాత్రుడిని తరలిస్తున్న అంబులెన్స్ సిబ్బంది

రేణిగుంట, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో ఆగి ఉన్న కారును ఢీకొని ఒకరు తీవ్రంగా, మరొకరు స్వల్పంగా గాయపడ్డారు. రేణిగుంట పోలీసులు తెలిపిన వివరాలు.. తిరుపతికి చెందిన వెంకటేష్, సురేష్ మద్యం తాగి ద్విచక్ర వాహనంపై వస్తుండగా గురవరాజుపల్లి వద్ద ఆగి ఉన్న కారును ఢీకొన్నారు. ఈ ఘటనలో సురేష్‌కు తీవ్రంగా, వెంకటేష్ స్వల్పంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న రక్షక్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో రుయా ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంపై పోలీసులకు ఇప్పటి వరకు ఫిర్యాదు అందలేదు.

తొట్టంబేడు ఎస్‌ఐగా రామాంజనేయులు



శ్రీకాళహస్తి, జూన్ 15(ఆంధ్రజ్యోతి): తొట్టంబేడు ఎస్‌ఐగా రామాంజనేయులు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన తిరుపతి ఈస్ట్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐగా బాధ్యతలు నిర్వహిస్తుండగా సాధారణ బదిలీల్లో తొట్టం బేడు ఎస్‌ఐగా బాధ్యతలు చేపట్టాడు. ఆయన మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తామని తెలిపారు.

అవసరానికి ఆదుకోని 108 అంబులెన్స్



పీహెచ్‌సీ ఆవరణలో అలంకారప్రాయంగా ఉన్న అంబులెన్స్

కేవీబీపురం, జూన్ 15(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 108 వాహనాన్ని ప్రభుత్వం గత రెండేళ్ల క్రితం ఏర్పాటు చేసింది. అయితే అవసరానికి ఈ వాహనం పని చేయకపోవడంతో రోగులు పలు అవస్థలు పడి ప్రైవేటు వాహనాలను ఆశ్రయించక తప్పడంలేదు. వాహనం నిత్యం మరమ్మతులకు గురవుతుంటోంది. రెండు రోజుల క్రితం అంబులెన్సు మరమ్మతులకు గురి కావడంతో శ్రీకాళహస్తికి తీసుకెళ్లడంలో ఆలస్యం కావడంతో ఆస్పత్రికి వెళ్లకుండా మార్గమధ్యంలోనే రోగి మృతి చెందాడు. 108 వాహనం మాత్రం ఆస్పత్రి ఆవరణలో అలంకార ప్రాయంగా ఉంటుంది. ఉపయోగం శూన్యం. అధికారులు స్పందించి పనిచేసే 108 అంబులెన్స్‌ను అందుబాటులో ఉంచాలని మండలవాసులు కోరుతున్నారు.

విద్యుత్‌శాఖ నిర్వాకం... తాగునీటి సమస్య ఉత్పన్నం!



కేవీబీపురం, జూన్ 15(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో విద్యుత్‌శాఖ నిర్వాకంతో గత రెండు రోజులుగా తాగునీటి సమస్య తలెత్తింది. నూతన విద్యుత్ స్తంభాలను నాటేందుకు విద్యుత్‌శాఖ సిబ్బంది ప్రజలకు ముందస్తు సమాచారం లేకుండానే ఎక్స్‌కవేటర్లతో గుంతలు తీయడంతో తాగునీటి పైపులైన్లు పగిలిపోయాయి. దీంతో ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. అలాగే విద్యుత్ సరఫరా లేకపోవడంతో ఫ్రిడ్జిలో నిల్వ పెట్టుకున్న పాలు, పెరుగు సహా కూరగాయలు పాడైపోయినట్టు వాపోయారు. ముందస్తు సమాచారం అందించి పనులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

పైపులైన్ పగిలిపోవడంతో గుంతలో చేరిన నీరు

సార్వత్రిక సమ్మెతో కార్మిక వర్గం సత్తా చాటుదాం



ఏఐటీయూసీ నాయకుల ర్యాలీ

శ్రీకాళహస్తి, జూన్ 15(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న కార్మిక వ్యతిరేక నిర్ణయాలపై నిరసనగా జూలై 9న జరిగే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి హరినాథ రెడ్డి పిలుపునిచ్చారు. శ్రీకాళహస్తి నియోజకవర్గ ఏఐటీయూసీ 3వ సభలు ఆదివారం పట్టణంలోని అంబేడ్కర్ భవన్‌లో ప్రారంభమయ్యాయి. ముందుగా ఏఐటీయూసీ నాయకులు ఆర్టీసీ కూడలిలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి ర్యాలీగా అంబేడ్కర్ భవన్‌కు చేరుకున్నారు. అనంతరం జరిగిన సభలో హరినాథ రెడ్డి మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై గ్రామస్థాయి నుంచి ఢిల్లీ వరకు పోరాటం చేస్తున్న ఏకైక సంఘం ఏఐయూటీసీ అని కొనియాడారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తరువాత 44 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్లను తీసుకువచ్చిందన్నారు. ఇక రాష్ట్ర ప్రభుత్వం 8గంటల పని విధానాన్ని రద్దు చేసి 10 గంటలకు పైగా పనిచేయాలని సవరణ చేయడం సిగ్గుచేటన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కార్మికుల కూలి రేట్లు పెరగడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర రెడ్డి, ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ, కార్యవర్గ సభ్యులు చిన్నం పెంచలయ్య, జె.గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

మినీ లారీకి నిప్పంటుకుని దగ్ధం



రేణిగుంట, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మినీ లారీకి నిప్పంటుకుని దగ్ధమైంది. ఈ సంఘటన శనివారం రాత్రి గాజులమండ్యం పోలీస్ స్టేషన్ సమీపంలో జరిగింది. ఎస్‌ఐ సుధాకర్ తెలిపిన వివరాలు... శ్రీసిటీ నుంచి తమిళనాడు రాష్ట్రంలోని హోసూరుకు స్క్రాప్‌తో వెళ్తున్న మినీ లారీ గాజులమండ్యం వద్ద వంతెనపై వస్తుండగా ఇంజన్లో మంటలు చెలరేగాయి. అవి లారీలో స్క్రాప్‌కు వ్యాపించాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఫైర్ ఇంజన్‌తో సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. సుమారు రూ.7 లక్షల నష్టం వాటిల్లిందని అధికారులు చెప్పారు. ప్రమాదంపై కేసు నమోదు చేయలేదని ఎస్‌ఐ తెలిపారు.

పాఠశాలల వాహనాల తనిఖీ



శ్రీకాళహస్తి, జూన్ 15(ఆంధ్రజ్యోతి): రెండో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో పలు ప్రైవేటు పాఠశాలల బస్సులను సీఐ నాగార్జునరెడ్డి పరిశీలించారు. వాహనాల రికార్డులు, డ్రైవింగ్ లైసెన్సులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలు, కళాశాలలు ప్రారంభమైన నేపథ్యంలో వాహనాలను ఎలాంటి మరమ్మతులు లేకుండా ఎప్పటికప్పుడు చూసుకోవాలన్నారు. విద్యార్థులను ఇంటి నుంచి పాఠశాలకు, పాఠశాల నుంచి ఇంటికి సురక్షితంగా చేర్చాలని సూచించారు. తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

రెండు కార్ల ఢీ: పలువురికి స్వల్ప గాయాలు





రేణిగుంట, జూన్ 15, (ఆంధ్రజ్యోతి): రెండు కారులు ఢీకొనడంతో పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. ఆదివారం సాయంత్రం మర్రిగుంట కూడలి సమీపంలో ఈ ప్రమాదం జరిగింది. గాజులమండ్యం పోలీసులు తెలిపిన వివరాలు... శ్రీకాళహస్తి నుంచి తిరుపతికి వస్తున్న కారు ఒక్కసారిగా ఎడమ పక్కకు తిరగడంతో వెనుక వేగంగా కారు అదుపు తప్పి ఢీకొంది. దీంతో రెండు కార్లలో ఉన్న పలువురు గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని రోడ్డుకు అడ్డంగా ఉన్న కార్లను ఎక్స్‌కవేటర్ సాయంతో పక్కకు తొలగించారు. ఈ ప్రమాదంపై పోలీసులకు ఫిర్యాదు అందలేదు.

శాస్త్రోక్తంగా సంకటహర చతుర్థి



హోమం చేస్తున్న వేదపండితులు

శ్రీకాళహస్తి, జూన్ 15(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలోని అంజంజి వినాయకస్వామి ఆలయం వద్ద సంకటహర చతుర్థిని పురస్కరించుకుని శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. ప్రతి కుటుంబం గణపతి హోమం నిర్వహించుకునే విధంగా ఆలయ అధికారులు సంకటహర చతుర్థి నాడు చేసే హోమాన్ని ఆర్జిత సేవగా తీసుకువచ్చారు. ఇందులో భాగంగా ఆదివారం అంజంజి గణపతి ఆలయంలో కలశ స్థాపన, గణపతి హోమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో ఈ పూజల్లో పాల్గొన్నారు.

వైసీపీలో బీసీలకు అగ్రస్థానం

ఏర్పేడు, జూన్ 15(ఆంధ్రజ్యోతి): వైసీపీలో బీసీలకు ప్రాధాన్యం ఇచ్చినట్లు ఆ పార్టీ ఏర్పేడు మండల అధ్యక్షుడు రమణయ్య యాదవ్ అన్నారు. సరస్వతి కండ్రిగ గ్రామస్తుల ఆధ్వర్యంలో ఆదివారం వైసీపీ మండల కమిటీని సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల కమిటీలో అత్యధికంగా బీసీలకు చోటు కల్పించామన్నారు. మునికృష్ణారెడ్డి, మునిరత్నంరెడ్డి, రామయ్య ఆచారి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ అధ్యక్షుడికి సన్మానం

ఏర్పేడు, జూన్ 15(ఆంధ్రజ్యోతి): మండలం టీడీపీ అధ్యక్షుడిగా ఎన్నికైన పేరం నాగరాజునాయుడిని జనసేన మండల నాయకులు, కార్యకర్తలు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఇరుపార్టీల మండలాధ్యక్షులు మండల అభివృద్ధిపై చర్చించారు. మండలాభివృద్ధికి కృషి చేయాలని తీర్మానించారు. చిరంజీవులునాయుడు, కిరణ్‌రాయల్, వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పశు వైద్యాధికారిగా శిల్పారెడ్డి



ఏర్పేడు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎండీపుత్తూరు పశు వైద్యాధికారిగా శిల్పారెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఏర్పేడులో పశువైద్యాధికారిగా పని చేస్తుండిన శిల్పారెడ్డి సాధారణ బదిలీల్లో భాగంగా ఎండీ పుత్తూరుకు బదిలీ అయ్యారు.